**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :56 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 19 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## చెత్త నుంచి సంపద సృష్టించడమే

# కూటమి లక్ష్యం



- రాష్ట్రంలో అక్టోబరు 2 నాటికి చెత్త లేకుండా చేస్తాం
- ఇంట్లో ఎవరికివారే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలి
- తడి చెత్తను కంపోస్టుగా తయారుచేసుకోవాలి
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

అమరావతి

చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి లక్ష్యం అని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో అక్టోబరు 2 నాటికి చెత్త లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. ఇంట్లో ఎవరికివారే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని సూచించారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలన్నారు. శాశ్వతంగా చెత్త నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేస్తామని సీఎం స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా గుడివాడలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యాక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. గుడివాడ నుంచే వర్చువల్‌గా రాష్ట్రవ్యాప్తంగా

వివరాలు 2లో..



## అసత్యం, హింసలే మోదీ ప్రభుత్వానికి మూల సిద్ధాంతాలు

- సోనమ్ వాంగ్‌చుక్‌ను జంతర్ మంతర్ నుంచి తరలించడాన్ని తప్పుబట్టిన రాహుల్ గాంధీ
- విద్యా ఖర్చులు, పేపర్ లీకులు, విద్యార్థుల ఆత్మహత్యలే కీలక సమస్యలని వ్యాఖ్యలు



## పోలవరం జిల్లాలో విషాదం

- గోదావరిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతి
- నదిలో చేపలు పట్టేందుకు వెళ్లిగోదావరిలో గల్లంతైన ఐదుగురు గిరిజనుల మృతదేహాలు లభ్యం
- మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు

అమరావతి

వారు చేపల వేటను వృత్తిగా నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. రోజులాగానే ఇవాళ కూడా చేపల వేట ప్రారంభించారు. కొద్ది సేపటి వరకు అంతా సజావుగానే సాగింది. ఈ క్రమంలో లోతైన ప్రాంతంలోకి వెళ్లడంతో ఒక్కసారిగా నీటిలో గల్లంతై మృతి చెందారు. దీంతో వారికి ఇదే చివరి రోజైంది. ఈ విషాద ఘటన పోలవరం జిల్లాలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గొమ్ము కొత్తగూడెంకు చటటందిన ఊకె సుశీల (37), ఊకె లక్ష్మి (37),

వివరాలు 2లో..




## అమెరికా వీసా ఫ్లెక్సిబిలిటీకి చెక్

- తీవ్ర ఆందోళనలో భారత విద్యార్థులు!
- డ్యురేషన్ ఆఫ్ స్టేటస్ విధానం రద్దు చేసిన అమెరికా
- ఎఫ్-1, జె-1, ఐ వీసా హోల్డర్లకు గరిష్ఠంగా నాలుగేళ్ల స్టే పరిమితి
- లక్షలాది భారతీయ విద్యార్థులపై ప్రభావం

## భారత అంతరిక్ష చరిత్రలో నవశకం

- స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్‌గా రికార్డు సృష్టి
- శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
- 'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం చారిత్రాత్మకం
- ప్రధాని సందేశంతో పాటు పలు పేలోడ్లను కక్ష్యలోకి మోసుకెళ్లిన 'విక్రమ్-1'





## సోనమ్ వాంగ్‌చుక్‌పై పోలీసుల చర్య

## ప్రజాస్వామ్యానికే మచ్చ

- ప్రొఫెసర్ జి.డి. అగర్వాల్, ఒలంపిక్ రెజ్లర్, రైతులు, ఇలా ఎవరినీ మోదీ సర్కార్ వదిలిపెట్టలేదని ఖర్గే వ్యాఖ్య
- ప్రతి పౌరుడికి తమ గళాన్ని వినిపించే హక్కును రాజ్యాంగం కల్పిస్తోందన్న పవన్ ఖేడా
- వాంగ్‌చుక్ ఘటన దాని మనస్తత్వాన్ని మరోసారి బయటపెట్టింది

## భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి

# ముహూర్తం ఖరారు

- ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం
- ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది మైలురాయి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- జీఎంఆర్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్ తొలిదశ వ్యయం రూ. 4,592 కోట్లు
- తొలిదశలో ఏటా 63 లక్షల మంది ప్రయాణికులకు సేవలు



అమరావతి

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. విశాఖపట్నం సమీపంలోని భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో గత కొంతకాలంగా ప్రారంభోత్సవ తేదీపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. శనివారం సాయంత్రం విమానాశ్రయ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన చంద్రబాబు, ఈ కీలక ప్రకటన చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..

## విజయవాడ నుంచి కనెక్టివిటీ పెంచేందుకు ప్రయత్నాలు



- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన నియంత్రణ సేవల భవనం ప్రారంభం
- ప్రారంభోత్సవానికి హాజరైన కేంద్రమంత్రి రామ్మోహన్, ఎంపీలు కేశినేని చిన్ని, బాలశౌరి
- ఏటీసీ భవనం ముందు మొక్క నాటిన రామ్మోహన్, చిన్ని



## అమర్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

భక్తులు రావొద్దని అధికారుల సూచన

ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా తాత్కాలితకంగా నిలిపివేత

## బాణసంచా పరిశ్రమలో పేలుడు

- 9 మంది మృతి- పలువురికి తీవ్రగాయాలు!
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటించిన కేంద్రప్రభుత్వం
- పేలుడులో గాయపడినవారికి రూ. 50 వేలు పరిహారం ప్రకటించిన కేంద్రం



# విజయవాడ నుంచి కనెక్టివిటీ పెంచేందుకు ప్రయత్నాలు

విజయవాడ నుంచి వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇప్పటికే ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు అదనపు సర్వీసులు నడుపుతున్నామని గుర్తుచేశారు. ఆగస్టు 13న విజయవాడ నుంచి వారణాసి మీదుగా కోల్‌కతాకు కొత్త విమాన సర్వీసు ప్రారంభిస్తామని చెప్పారు. విదేశాలకు వెళ్లే ప్రయాణికుల ఇమ్మిగ్రేషన్ కష్టాలను తొలగించేందుకు 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌ను విజయవాడలో ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏటీసీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.

అంతకుముందు రామ్మోహన్? నాయుడు రూ.77 కోట్లతో నిర్మించిన నూతన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఏటీసీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భవన ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం రాత్రివేళ ఏటీసీ భవనం మిరమిట్లు గొలిపేలా చేసిన ప్రత్యేక అలంకరణను తిలకించి సిబ్బందిని ప్రశంసించారు. ఏవియేషన్ రంగానికి సంబంధించి అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అనంతరం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్‌లతో కలిసి విమానాశ్రయ అభివృద్ధి పనులపై రామ్మోహన్ నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇంతవరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. దసరాకు నూతన టెర్మినల్ ప్రారంభమే లక్ష్యంగా పనులు సాగాలని రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణాన్ని వేగవంతం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యంలో ఒకటని స్పష్టం చేశారు.

పాత కాంట్రాక్టర్‌పై సీబీఐ కేసులు, ఇతర సమస్యల వల్ల పనులు నత్తనడకన సాగాయని రామ్మోహన్ నాయుడు




చెప్పారు. అయితే దీనిపై వెంటనే స్పందించి, ఆ కాంట్రాక్టర్‌ను తొలగించి కొత్త కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించామన్నారు. కార్మికుల సంఖ్యను పెంచి, అవసరమైతే 24 గంటలపాటు పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 15 దసరా నాటికి టెర్మినల్ నిర్మాణాన్ని పూర్తి చేసి, ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయాలని స్థానిక ఎంపీలు కేంద్రమంత్రిని కోరారు.

"సీఎం చంద్రబాబు సైతం ఈ విమానశ్రయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. విమాన రాకపోకల ఆపరేషన్స్‌లో ఏటీసీ భవనం అత్యంత కీలకమైంది. గత 40-50 ఏళ్ల క్రితం నిర్మించిన పాత భవనం నుంచే ఇప్పటివరకు కార్యకలాపాలు సాగుతున్నాయి. ప్రస్తుతం విజయవాడలో విమానాల రద్దీ విపరీతంగా పెరిగిన నేపథ్యంలో రాబోయే 30-40 సంవత్సరాల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌తో రూ.77 కోట్లతో ఈ నూతన భవనాన్ని నిర్మించాం. - రామ్మోహన్ నాయుడు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి

విజయవాడ నుంచి ప్రపంచంలోని అన్ని ప్రధాన నగరాలకు కనెక్టివిటీ పెంచేలా కనీసం వారానికి రెండు సార్లయినా దుబాయ్‌కి ఎమిరేట్స్ విమానాన్ని నడపాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, రామ్మోహన్ నాయుడికి విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఆఫ్రికా, అమెరికా, ఆసియా, యూరప్ దేశాలకు వెళ్లే ప్రయాణికులకు ఎంతో వెసులుబాటు కలుగుతుందని వివరించారు. రాబోయే శబరిమల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం కొచ్చిన్‌తో పాటు అహ్మదాబాద్, గోవాలకు కూడా సర్వీసులు నడపాలని విజయవాడ ఎంపీ శినేని శివనాథ్ కోరారు.

# టార్గెట్లతోనే జనసేన పని

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటి నుంచే క్షేత్రస్థాయి వ్యూహాలకు పదును పెడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయాల జోష్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించాలని, జనసేన పోటీ చేసే ప్రతి స్థానంలోనూ ఖచ్చితంగా గెలిచి తీరాల్సిందేనని ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు జనసేన ముఖ్య నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు పవన్ కళ్యాణ్ పక్కా టార్గెట్లను నిర్దేశిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో ప్రధానంగా ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు గట్టి గండి కొట్టాలని పవన్ కళ్యాణ్ పట్టుదలగా ఉన్నారు. గతంలో అధికార బలాన్ని ఉపయోగించి వైసీపీ ఏకగ్రీవాలు చేసుకున్న దుస్థితి మళ్లీ రాకూడదని, ఎక్కడా ఒక్క స్థానం కూడా వైసీపీ ఏకగ్రీవం కాకుండా పటిష్టమైన నిఘా మరియు వ్యూహాలు అమలు చేయాలని ఆయన ఆదేశించారు. కూటమిలోని మిత్రపక్షాలైన తెలుగుదేశం, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూనే, జనసేన బలంగా ఉన్న ప్రాంతాల్లో మేజర్ స్థానిక సంస్థలను కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ క్లీన్ స్వీప్ చేసిన 21 నియోజకవర్గాల్లోని మేజర్ స్థానిక సంస్థలపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. తాను అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకున్న ఆ 21 స్థానాల పరిధిలోని మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో మెజారిటీ స్థానాలను జనసేన ఖాతాలోనే వేయాలని ఆయన పట్టుదలతో ఉన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పార్టీ క్యాడర్‌ను యాక్టివ్ చేయడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించి, క్షేత్రస్థాయిలో పార్టీ మూలాలను మరింత బలోపేతం చేయాలని పవన్ కళ్యాణ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

**సేనానికి సెగ**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన సొంత పార్టీ నేతల నుంచే కొంత అసంతృప్తిని ఎదుర్కొంటున్నారు. పవన్ కళ్యాణ్ నయకత్వాన్ని ఎవరూ కాదనడం లేదు. కానీ పొరుగున ఉన్న



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తో పోల్చి మరోసారి చూపుతూ సోషల్ మీడియాలో వస్తున్న పోస్టింగ్ లు పవన్ ను కొంత ఇబ్బంది పెడుతున్నాయి. తమిళనాడులో మొన్నటి ఎన్నికల్లో విజయ్ గెలిచిన వెంటనే ఒంటరిగా పోటీ చేసి గెలిచాడని, మనం ఎందుకు చేయకూడదని జనసేన క్యాడర్ ప్రశ్నించినట్లు పవన్ కళ్యాణ్ ఒక సమావేశంలో చెప్పారు. అయితే తమిళనాడుకు, ఆంధ్రప్రదేశ్ కు చాలా తేడా ఉందని, తనను విజయ్ పార్టీతో పోల్చవద్దని కూడా పవన్ కళ్యాణ్ పదే పదే చెబుతున్నారుకాగా తమిళనాడు లో విజయ్ సినీ రంగం నుంచి నేరుగా రాజకీయ రంగంలోకి వచ్చారు. అయినా సరే ఏ మాత్రం జంకుబొంకు లేకుండా పాలన చేస్తున్నారు. పాలనలో తన మార్క్ ను విజయ్ చూపుతున్నాడు. అవినీతికి వ్యతిరేకంగా విజయ్ తీసుకుంటున్న నిర్ణయాలు దేశ వ్యాప్తంగా చర్చకు కారణమయ్యాయి. అలాగే ఆకస్మిక తనిఖీలతో విజయ్ ప్రభుత్వ అధికారుల వెన్నుల్లో వణుకు పుట్టిస్తున్నారు. మద్యం విషయంలోనూ, ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ ఎక్కడా విజయ్ నిధులు లేవు అని చెప్పడం లేదు. అలాగే ప్రత్యర్థులపై విరుచుకుపడుతూనే తన లక్ష్యమేంటో ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా తనకు ఎక్కడా రాజకీయ అనుభవం లేదని ఆయన చెప్పుకోవడం లేదు.. కానీ పవన్ కళ్యాణ్ మాత్రం తరచూ తనకు పాలన అనుభవం తక్కువని, అందుకే తాను పొత్తు పెట్టుకోవాల్సి వస్తుందని చెప్పడాన్ని జనసైనికులే తప్పుపడుతున్నారు. ఒక ముఖ్యమంత్రికి పాలనా అనుభవం అవసరం లేదని, సామాజిక స్పృహ ఉంటే సరిపోతుందని, పాలనపరమైన వ్యవహారాలను ఉన్నతాధికారులు చూసుకుంటారని, అనుభవజ్ఞులైన మంత్రులను పెట్టుకుంటే పాలన చేయడం పెద్ద కష్టమేమీ కాదని, అలాగనుకుంటే ఎవరూ క్రమేపీ ముఖ్యమంత్రి కాలేదని, తొలిసారి నేరుగా ముఖ్యమంత్రి అయి ఎన్నో జనరంజక కార్యక్రమాలన చేపట్టిన విషయాలను ఈ సందర్భంగా కొందరు సోషల్ మీడియాలో గుర్తు చేస్తున్నారు. కానీ అనుభం లేదన్న సాకుతో పదిహేనేళు పొత్తు పెట్టుకుంటామని చెబుతుండటాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కానీ పవన్ షణ్ముఖ వ్యూహం ఏంటో తెలియదని, అది తెలిసిన తర్వాత తమ గళం విప్పుతామని కొందరు అంటున్నారు.

# హస్తినకు పోయి రావలె...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి త్వరలోనే దేశ రాజధాని ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ నెల 20వ తేదీ నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, అదే సమయంలో ఆయన ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న రాజకీయ పరిణామాలు, లాకప్ డెత్ వ్యవహారాలూ తమ పార్టీ శ్రేణులపై జరుగుతున్న దాడుల అంశాన్ని జాతీయ స్థాయిలో చర్చకు పెట్టడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుందని సమాచారం. ఈ పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ కేంద్ర ప్రభుత్వ పెద్దలను, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా ఇతర కీలక నాయకులను కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఏపీలో ప్రస్తుతం నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితిపై ఆయన కేంద్రానికి ఒక సమగ్ర నివేదికను సమర్పించనున్నట్లు వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులు, ఆస్తుల ధ్వంసం మరియు నమోదైన కేసుల వివరాలను ఆయన కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లనున్నారు.కేంద్ర ప్రభుత్వ పెద్దలతో పాటు పార్లమెంట్ వేదికగా జాతీయ మీడియా మరియు ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగట్టేందుకు కూడా జగన్ వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. తమ పార్టీకి ఉన్న ఎంపీల ద్వారా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఏపీ పరిణామాలపై గళం విప్పేలా ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన నాయకులను వేధిస్తున్నారనే కోణంలో కేంద్రానికి ఫిర్యాదు చేయడం ద్వారా, కూటమి ప్రభుత్వంపై జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావచ్చని జగన్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ నేతలను ఇంకా యాక్టివ్ చేయాల్సిన అవసరం ఉంది. ఎన్నికలు పూర్తయి రెండేళ్లవుతున్నా ఇంకా కొందరు నేతలు మాత్రమే పార్టీలో యాక్టివ్ రోల్ పోషిస్తున్నారు. అందులోనూ ఒక సామాజికవర్గానికి చెందిన నేతలే ఎక్కువగా మీడియాలో కనిపిస్తున్నారు. మిగిలిన నేతలు బయటకు రావడం లేదు. వైఎస్ జగన్ అనేక పర్యటనలు చేస్తున్నారు. జిల్లాలు తిరుగుతున్నారు. అయినా అక్కడి వరకే నేతలు పరిమితమవుతున్నారు. పూర్తి స్థాయిలో నేతలు యాక్టివ్ కాకపోవడంతో వైసీపీ క్యాడర్ కొంత అయోమయంలో ఉంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో నేతలు కనెక్ట్ కాకుంటే గెలుపు అసాధ్యమని చెబుతున్నారు. జగన్ పర్యటనలు విజయవంతం అవుతున్నప్పటికీ ఎన్నికల సమాయానికి క్యాడర్, లీడర్ కలసి పనిచేస్తేనే కొంత సక్సెస్ లభిస్తుంది. కానీ ఇప్పుడు దాదాపు వంద నియోజకవర్గాల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం ఇంకా వేచి చూడాలని నాయకులు అనుకోవడమే. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు కొంత ఊపు మీద ఉన్నప్పటికీ వారికి అవసరమైన న్యాయ సాయాన్ని అందించడంలోనూ లీడర్లు విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో జగన్ అనేక సార్లు సమావేశాలు పెట్టి నేతలకు హిత బోధ చేసినప్పటికీ నేతల్లో మార్పులు రాకపోవడం, కొందరు టీడీపీ ఎమ్మెల్యేలతో కలసి వ్యాపారాలు సాగించడం వంటి కారణాలు ఈ పరిస్థితికి కారణమని కార్యకర్తలే నేరుగా ఆరోపణలు చేస్తున్నారు.. వైసీపీ అధినేత గా జగన్ ఈసారి కూడా తన వల్లనే పార్టీ గెలుస్తుందన్న భ్రమలో ఉన్నారు. కానీ ఆ భ్రమ నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిదన్న సూచనలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో క్యాడర్ కు లీడర్ కు మధ్య సమన్వయ లేమితోనే దారుణ ఓటమి చవి చూడాల్సి వచ్చిందని చెబుతున్నారు. కానీ తన పర్యటనలకు వస్తున్న జనాలను చూసిన జగన్ కు మాత్రం ఈసారి కూడా తన బొమ్మ అధికారం తెచ్చి పెడుతుందన్న అతి విశ్వాసంతో ఉన్నారు. కానీ అవతల కూటమి కలసి ఉంటే గెలుపు అన్నది అంత సులువు కాదన్న విషయాన్ని గుర్తుంచుకుని వీలయినంత త్వరగా నియోజకవర్గాల వారీగా సమావేశాలు పెట్టుకుంటే మంచిదని కొందరు హితవు పలుకుతున్నారు. మరి జగన్ ఒకరి మాట వినేరకం కాదంటున్న వారు.. అది జరగని పని.. నష్టం జరిగేంత వరకూ ఆయనంతే అంటూ నిట్టూర్చే వారి సంఖ్య వైసీపీలో ఎక్కువగా ఉంది.

## చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

చేపట్టనున్న పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఎన్టీఆర్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రజావేదిక సభలో పాల్గొన్నారు. స్వచ్ఛతలో మెరుగైన పనితీరు కనబర్చిన మున్సిపాలిటీలు, పంచాయతీల అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ ఏడాది గాంధీ జయంతి నాటికి రాష్ట్రంలో వారసత్వంగా పేరుకుపోయిన చెత్తను లేకుండా చేస్తామని సీఎం వెల్లడించారు. ఇంటి నుంచి చెత్త రాకుండా నెట్ జీరో అన్నది మన విధానం కావాలని సీఎం పిలుపునిచ్చారు.

**చెత్తతో పాటు చెత్త రాజకీయాలకు చోటులేకుండా చేస్తాం**

రాష్ట్రంలో వైఎస్సార్సీపీ పాలకులు పేరబెట్టిన చెత్తతో పాటు చెత్త రాజకీయాలకు చోటులేకుండా చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు తేల్చిచెప్పారు. రాజకీయాల్లో అక్కడక్కడా ఇప్పటికీ కనిపిస్తున్న చెత్తను ప్రజలే లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ, స్వచ్ఛాంధ్ర కార్మికుల పిల్లలకూ తల్లికి వందనం ఇస్తామని ప్రకటించారు.

2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని రాజకీయచెత్తను చాలా వరకూ ప్రజలు ఊడ్చేశారని సీఎం అన్నారు. అక్కడక్కడా మిగిలిన చెత్తనూ శాశ్వతంగా ఊడ్చేయడమే గొడ్డలిపార్టీకి సరైన సమాధానమన్నారు. ఈ నెల 22 నుంచి 24వ వరకూ తల్లికి వందనం నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని సీఎం వెల్లడించారు. తొలిసారి అంగన్వాడీలు, స్వచ్ఛాంధ్ర కార్మికుల పిల్లలకూ తల్లికి వందనం పథకం అమలు చేస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం పారదర్శక పాలనను అందిస్తోందన్న సీఎం అవినీతిని ఎంత మాత్రం సహించబోమని తేల్చిచెప్పారు. నియోజకవర్గంలో విభాగాల వారీగా అధికారుల ప్రోగ్రెస్ కార్డును చదివి వినిపించారు.

**రాష్ట్రంలో కాలుష్యం లేకుండా చేస్తాం**

"చెత్త పేరుకుపోవడం వల్ల అనేక రోగాలు వస్తాయి. మే 23 నుంచి జూన్ 20 వరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం పెట్టాం. చాలామంది ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో పాల్గొన్నారు. 12 ఏళ్ల ముందు కృష్ణా డెల్టాకు నీళ్లు వచ్చేవి కావు. కృష్ణా జిల్లా దేశానికి అన్నం పెట్టిన స్థలం. కవుల నుంచి హీరోల వరకు ఎంతోమంది ఈ గడ్డమీద పుట్టినవారే. 12 ఏళ్లలో ఎంతో కృషి చేసి పట్టిసీమ నుంచి కృష్ణా జిల్లాకు నీరు తెచ్చాం. వానలు లేక ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోతున్నాయి.

రాష్ట్రంలో కాలుష్యం లేకుండా చేస్తాం. చాలామంది పంటలకు క్రిమిసంహారక మందులు వాడడం లేదు. ముందుచూపుగా ఆలోచించి ప్రకృతి సేద్యాన్ని తీసుకొచ్చాం. పీఎం కిసాన్ కింద ప్రతిఏటా రైతుల ఖాతాల్లో రూ.20 వేల వరకు జమ చేస్తున్నాం. స్త్రీ శక్తి కింద మహిళలకు ఉచిత బస్సు తీసుకొచ్చాం. ఈనెలలోనే తల్లికి వందనం కింద డబ్బులు వేస్తాం. ప్రజలను చైతన్యవంతులు చేసి ఉపాధి కల్పిస్తున్నాం. అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో పనిచేసే కార్మికులకు తల్లికి వందనం అమలు చేస్తాం. త్వరలో అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో పనిచేసే కార్మికుల అకౌంట్లలో డబ్బులు వేస్తాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

"ప్రతిఇంటికి కుళాయి ఇవ్వడానికి రూ.23 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. వాటర్ సప్లై కోసం రూ. 10 కోట్లు వరకు ఖర్చు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో గుడివాడలో రూ.162 కోట్లు ఖర్చు పెడతాం. అందరి భాగస్వామ్యంతో అనేక పనులు పూర్తవుతాయి. గుడివాడ ప్రజలు బంపర్ మెజారిటీతో కూటమిని గెలిపించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకెళ్తున్నాం. రాజకీయాల్లో క్రిమినల్స్ మారరు, మనం మార్చితే తప్పా మారరు. డిప్యూటీ సీఎం కుటుంబంపై అనరాని మాటలు అన్నారు."

## భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు

-మొదటిపేజీ తరువాయి

ఈ ప్రాంతంలోని పర్యాటకం, పోర్టులు, జాతీయ రహదారులు, పారిశ్రామిక ప్రగతితో కలిసి ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రను 'అన్‌స్టాపబుల్' శక్తిగా మారుస్తుందని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం వద్ద, విశాఖ నగరానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి-16కు సమీపంలో సుమారు 2,200 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. ప్రఖ్యాత మౌలిక సదుపాయాల సంస్థ జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన 'జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (+ఎ×ూూ)' ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. తొలి దశలో భాగంగా రూ. 4,592 కోట్ల వ్యయంతో ఎయిర్‌పోర్టును నిర్మించారు. మొదటి దశలో ఏటా 63 లక్షల (6.3 మిలియన్ల) మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యంతో టెర్మినల్ భవనాన్ని తీర్చిదిద్దారు. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రెండో దశలో 1.2 కోట్లు, మూడో దశలో 1.8 కోట్ల మందికి విస్తరించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఈ ప్రాజెక్టు పలు ప్రభుత్వాల హయాంలో పురోగతి సాధించింది. 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2024 సెప్టెంబర్‌లో ఈ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేశారు. ప్రస్తుతం విశాఖ నగరంలోని ఐఎన్ఎస్ డేగా నేవల్ ఎయిర్‌బేస్ నుంచి కొనసాగుతున్న పౌర విమానయాన కార్యకలాపాలు దశలవారీగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు మారనున్నాయి. ఈ విమానాశ్రయం చుట్టూ 'ఏరోట్రోపాలిస్'ను అభివృద్ధి చేసే ప్రణాళికలు కూడా ఉన్నాయి. ఈ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర పారిశ్రామిక, పర్యాటక రంగాలకు కొత్త ఊపు వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పోలవరం జిల్లాలో విషాదం



-మొదటిపేజీ తరువాయి

తుర్రం భారతి (40), భాసుబోయిన బాలరాజు (38), ఊకె రమేశ్‌గా (38) ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు దిగారు. చేపలు పడుతున్న సమయంలో లోతైన ప్రాంతంలోకి వెళ్లడంతో ఒక్కసారిగా వారు నీటిలో గల్లంతయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చేపట్టారు. గంటల పాటు గాలించి ఐదుగురు మృతదేహాలను వెలికి తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు విగత జీవులుగా పడి ఉన్న తమవారిని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు రోదించిన తీరు అక్కడి వారిని కలిచివేసింది. కుటుంబ పెద్దలు చనిపోవడంతో 5 కుటుంబాలు రోడ్డున పడ్డాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు మృతి చెందటంతో గొమ్ముకొత్తగూడెంలో విషాదఛాయలు అలముకున్నాయి. గోదావరిలో ఐదుగురు మృతి ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఐదుగురు గిరిజనుల మృతిపై హోంమంత్రి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులకు ఆదేశాల్చిచారు. చేపల వేటకు వెళ్లి ఐదుగురు మరణించిన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గోదావరిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతిపై మంత్రి సంధ్యారాణి ఆరా తీశారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదుగురు గిరిజనులు మృతి చెందినట్లు అధికారులు మంత్రికి వివరించారు. మృతుల కుటుంబాలకు మంత్రి సంధ్యారాణి ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేతోనూ మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# పేద పిల్లలకు పెన్నులు పుస్తకాలు పంపిణీ





**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 18:**ప్రముఖ వ్యాపారవేత్త, తూర్పు కాపు సంఘం పెద్దలు, కోరుకొండ కాసులు (కాశి) రెండవ వర్ధంతి సందర్భంగా స్టేషన్ రోడ్ లో ఆయన బుక్స్ షాపు వద్ద శనివారం ఆయన కుమారులు కోరుకొండ రమేష్, రాఘవ చిన్న ఆధ్వర్యంలో పేద పిల్లలకు పెన్నులు పుస్తకాలు, పేదలకు చీరలు దుప్పట్లు, భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, వైఎస్ఆర్సిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు జాజుల రమేష్, అప్పికొండ రవి, కోరుకొండ అప్పలసూరి, కోట్ని రాంబాబు, గాడి మాధురి నాయుడు, ఉగ్గిన అప్పారావు, సిరసపల్లి సాంబ, ముమ్మిన పైడిరాజు, ఈశ్వరరావు, కేతిరెడ్డి ప్రసాద్ , కోరుకొండ వాసు, నక్క నరేష్, ఏడుపాక నారాయణ రావు,ఇల్లపు గణేష్, కరణం శ్రీనివాసరావు, పెనుమచ్చ సాయిరాజు తూర్పు కాపు సంఘం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# వివి రమణ 48 వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి.



**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 18:**రాజ్యసభ సభ్యులు గా, రెండు పర్యాయాలు ఎన్నికైన వివి రమణ అనకాపల్లి ప్రాంతీయవాసుల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేశారని లీడర్ సంపాదకులు వివి రమణమూర్తి, టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. రైతు బంధువు, తుమ్మపాల వివి రమణ షుగర్ ఫ్యాక్టరీ వ్యవస్థాపకులు, గౌరీ పిఎసిఎస్ వ్యవస్థాపకులు, వ్యవసాయదారుల సంఘ వ్యవస్థాపకులు వివి రమణ 48 వ వర్ధంతి ని వ్యవసాయదారుల సంఘం లోగల వారు సమాధి వద్ద శనివారం ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. వివి రమణ చిత్రపటానికి వారి కుటుంబ సభ్యులు, లేటెస్ట్ సంపాదికులు విల్లూరు రమణ మూర్తి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి దాడి రత్నాకర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. రమణ అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూని ఎంతగానో ఆకట్టుకున్నారని, ఆయన ఆశయ శాఖల కోసం మనమంతా కలిసి కృషి చేయాలని అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరు పైడా రావు, కర్రి దివాకర్, తమ్మన సుబ్బారావు, వెల్లూరు సూరిబాబు, విల్లూరు రాము, విల్లూరు జగన్నాధ రావు నాయుడు,విల్లూరు రంగాజీ వివి రమణబాబు, విల్లూరి లక్ష్మణరావు, రామచంద్రరావు,విల్లూరు ధర్మారావు, విల్లూరు చంద్రం రమణబాబు, కొణతాల రమణ అప్పారావు, విల్లూరు మహాలక్ష్మి నాయుడు, విల్లూరి రాముడు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం.







**కశింకోట, పెన్ సత్తా, జులై 18:**
కసింకోట మండలం, ఈ చౌడువాడ గ్రామంలో వ్యవసాయ శాఖ, ఆత్మ వారి సౌజన్యంతో రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వనరుల కేంద్రం డిడిఏ సిహెచ్. సుబ్రమణ్యం మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతుల పాటించడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందుతున్నారని తెలిపారు. పతి రైతు కూడా రసాయనిక ఎరువులు బదులు, సేంద్రియ ఎరువుల వాడాలని తెలిపారు. జీడి మామిడి వంటి పంటలకు డ్రిప్పు, స్ప్రింక్లర్ వంటి పద్ధతులను అవలంబించి రైతులు నీటి సదుపాయాన్ని ఆదా చేసుకోవచ్చని తెలిపారు. పతి రైతు కూడా భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. జీడి మామిడి ఒంటి పంటలకు సమపాలలో ఎరువులు యాజమాన్యం చేపట్టాలని తెలిపారు. అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు( ఏడిఏ) కే.ధనలక్ష్మి మాట్లాడుతూ ఈ వ్యవసాయ యాంత్రికరణ పద్ధతులను ఉపయోగించి వ్యవసాయం చేయడం వలన రైతులకు కూలీలు అయ్యే ఖర్చు మిగులుతుందని తెలిపారు. రసాయనకి ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడాలని తెలిపారు ప్రతి రైతు కూడా పంటలను పంటలు బీమా కింద నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతు కూడా ఈ పంటల భీమా మీ దగ్గరలో ఉన్న మీసేవ కేంద్రంలో పంటల బీమా చేసుకోవాలని తెలిపారు. ఈ పంటల బీమా కింద వరి పంటకు ఎకరాకు 84/- రూపాయలు, రబీ పంట లైన జీడిమామిడికి 1,540/- రూపాయలు ఒక ఎకరాకు చెల్లించాలని తెలిపారు. రైతులు ఈ యొక్క మంచి అవకాశాన్ని వినియోగించు కోవాలని ఈ సందర్భంగా తెలిపారు. సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, పశువులు, గేదలు, ఆవులు, గొర్రెలు, మేకలు, ఉద్యానవన పంటలు, నూతన వ్యవసాయ విధానం, ఈ సమీకృత వ్యవసాయం కింద వస్తాయని తెలిపారు. అదే విధంగా ప్రతి రైతు ఎరువులు వినియోగం తగ్గించాలని సేంద్రియ ఎరువులు వాడాలని తెలిపారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బండి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. జీడి, మామిడి పంటలో యాజమాన్య పద్ధతుల గురించి తెలిపారు. అదేవిధంగా జీడి, మామిడి పంటల్లో కొమ్మ కత్తిరింపులు గురించి రైతులకు వివరించారు. అదే విధంగా కొబ్బరి యాజమాన్య పద్ధతుల గురించి కూడా తెలిపారు. కొబ్బరి పంటలో మొదల పురుగు నివారణకు చర్యలు గురించి వివరించారు. కొబ్బరి వేసే రైతులు తప్పనిసరిగా బోరాన్ 50 గ్రాములు చొప్పున మొక్కకు వేయాలని తెలిపారు. రైతులు రసాయనకి ఎరువులు బదులు జీవన ఎరువులు వాడాలని తెలిపారు. సమీకృత వ్యవసాయం చేయడం వలన రైతులకు అధిక లాభం కలిసి వస్తుందని తెలిపారు. ఉద్యాన శాఖ అధికారి ఏ.లావణ్య మాట్లాడుతూ రైతులు వ్యవసాయ యాంత్రికరణ పద్ధతులు ఉపయోగించి ఉద్యాన పంటలు సాగు చేయవచ్చు అని తెలిపారు. ఉద్యానవన పంటల్లో రైతులు వ్యవసాయ మంత్రి కన్నా పద్ధతులు ఉపయోగించడం వల్ల అధిక లాభాలు పొందవచ్చు అని తెలిపారు. ఈ సమీకృత వ్యవసాయ విధానము ద్వారా రైతులు అధిక ఆదాయం సమకూరుస్తుందని తెలిపారు. ఈ సమీకృత వ్యవసాయ పద్ధతులు వలన ఉద్యాన పంటలైన కూరగాయలు అరటి జామ, సపోటా మొదలగు ఉద్యానవన పంటలు కూడా వ్యవసాయ యాంత్రికరణ ద్వారా విధానము ద్వారా రైతులు విలంబించని తెలిపారు. ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ మాట్లాడుతూ ఈ వ్యవసాయ యాంత్రికరణ పద్ధతులు రైతులకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా రైతులు ఈ సమీకృత వ్యవసాయ విధానమనేది పాడి, పంట అనే నినాదంతో పూర్వం మన రైతులు ఈ సమీకృత వ్యవసాయ పద్ధతులు పాటించేవారు అని తెలిపారు. అదేవిధంగా సమగ్ర పోషక ఎరువులు వినియోగం ఎంత అవసరం అని,ఇందులో రసాయన ఎరువులతో పాటు,సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు మరియు పచ్చి రొట్టె ఎరువులు సమతుల్యంగా ఉపయోగించాలని, కేవలం రసాయన ఎరువులపై మాత్రమే ఆధారపడకుండా నేల పరీక్షలు ఆధారంగా అవసర మైన మోతాదులో ఎరువులు వాడితే పంటలు బాగా పెరుగుతాయని, దిగుబడి మెరుగుపడి, నేల సారం పెరుగుతుందని, పంట దిగుబడి మెరుగువుతుందని ఎరువులు ఖర్చు తగ్గుతుందని పర్యావరణానికి మేలు జరుగుతుందని రైతులు ఈ జీవన ఎరువులు వాడాలని తెలిపారు. అదే విధంగా ఎకరాకు 500 ఎంఎల్ నానో యూరియా అన్ని రకాల పంటలకు పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. తప్పనిసరిగా పాటించాలని తెలిపారు, అదే విధంగా ప్రతి రైతు తప్పనిసరిగా రసాయనికి ఎరువులు బదులుగా, జీవన ఎరువులు వాడాలని తెలిపారు రైతులు ఈ జీవన ఎరువులు వాడకం వలన భూమి సారవంతం అవుతుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి స్వప్న మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలు అవుతున్న పథకాలు, రాయితీలు గురించి రైతులకు తెలిపారు. రైతులకు పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం గురించి వివరించారు. అతి రైతు కూడా పంటల భీమా చేయించు కోవాలని తెలిపారు. అదే విధంగా ఈ పకృతి వ్యవసాయ విధానము ద్వారా రైతులు బీజామృతంతో విత్తన విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు తెలిపారు. సంతోష్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, రాయితీలు గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి రామకృష్ణ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, పకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


# డాక్టర్ మురళీ మోహన్ సామాజిక వైద్య సేవలు అజరామరం.


- రాజనాథ్ సింగ్, భారత రక్షణ శాఖ మంత్రి.




**ఢిల్లీ, జులై 18:**డాక్టర్ మురళీ మోహన్ సామాజిక వైద్య సేవలు అజరామరం అని భారత రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ అన్నారు. శనివారం ఉదయం ఢిల్లీ మహా నగరం లో సిజిఒ కాంప్లెక్స్, సన్ సద్ మార్గ్ న్యూ దిల్లీ లోని కానిస్టట్యూషన్ క్లబ్ లో భారత జాతీయ వైద్యుల సంఘం జాతీయ వైద్యుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మురళీ మోహన్ కు ప్రతిష్టాత్మక కమ్యూనిటీ సర్వీస్ అవార్డు విభాగంలో అవార్డు ను అంద జేశారు. ఈ సందర్భంగా రాజనాథ్ సింగ్ మాట్లాడుతూ డాక్టర్ మురళీ మోహన్ సామాజిక వైద్య సేవలు మరువలేనివి అని వివరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మయాంక్ భాయ్ జె. నాయక్, ఈ కార్యక్రమానికి ఐఎం ఎ అధ్యక్షులు డా. అనిల్ జె. నాయక్ అధ్యక్షత వహించారు, డాక్టర్ దిలీప్ బన్సాలియా డాక్టర్ సరాసరి దత్తా, పియూష్ జైన్ తదితరులు పాల్గొని మాట్లాడారు.
డాక్టర్ మురళీ మోహన్ మాట్లాడుతూ తాను నిర్వహిస్తున్న సేవలు గుర్తించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు.


# గౌరీ పరమేశ్వరుల ఉంజల్ సేవ.





**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 18:**గౌరీ పంచాయతన దేవస్థానం నందు, గౌరీ పరమేశ్వరుల 218 వ ఉంజల్ సేవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమమునకు దేవాలయ అర్చకులు అంపోలు గోపాల కృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి, వేదవిదు లైన పండితులచే నిర్వహించబడినది. ఈ ఉంజల్ సేవలో గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని భక్తి బృందం సభ్యులు, దాడి శ్రీనివాసరావు మోహిని, బుద్ధ వెంకటరావు జయలక్ష్మి, శరగడం బాల రామేశ్వర రావు, వెంకట పద్మ, ఆళ్ల శ్రీనివాసరావు భారతి, ఉల్లికొండ అప్పలరాజు వరలక్ష్మి
పాల్గొన్నారు. గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని పెంటకోట సుజాత కోలాట సంస్థ స్థాపించి నేటికీ 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శ్రీ గౌరీ సేవా సంఘం పాలకవర్గ సభ్యులు, మాజీ ఎంపీ బీశెట్టి వెంకటసత్యవతి విష్ణుమూర్తి దంపతులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరీ గీత మహిళా మండలి, సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, గురు పరమేశ్వరి ధ్యాన దాయిని, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్,, ఆళ్ల ప్రసాద్ మరియు పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

## వారాహిదేవిగా ధర్శనం ఇచ్చిన శతకం పట్టు కనకదుర్గ.



**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 18:** గవరపాలెం శతకం పట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయములో అష్టమి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కె హరినారాయణ, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆషాడ మాసం మొదట ఆదివారం సందర్భంగా కనకదుర్గ అమ్మవారిని వారాహి దేవిగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమర శెట్టి వరాహ నూకరాజు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గౌరీపరమేశ్వరుల కమిటీ సభ్యులు, మరిదిమాంబ కమిటీ సభ్యులు, గౌరీ పరమేశ్వరి ప్రజాటెంట్ హౌస్, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో జేసీ అపూర్వ భరత్ ఆకస్మిక తనిఖీ



**కాకినాడ, పెన్ సత్తా, జూలై 18** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ, ఐసీయూ, ఈఆర్ఐసీయూ వార్డులు, ఎక్సరే, ఎంఆర్ఐ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, మరుగుదొడ్లలో సౌకర్యాలు, మందుల లభ్యతపై జేసీ అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి, వైద్య సేవలు, సదుపాయాల పట్ల వారి సంతృప్తిని, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్ లావణ్య కుమారి, ఇతర వైద్య అధికారులు, వివిధ విభాగాల అధిపతులతో జేసీ అపూర్వ భరత్ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంలో ఏమాత్రం రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని స్పష్టం చేశారు. వివిధ వార్డులో ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను రోగులకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని జేసీ అపూర్వ భరత్ వైద్య సిబ్బందికి సూచించారు.


ఈ పరిశీలనలో జేసీ వెంట జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్ శ్రీధర్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసన్, వివిధ విభాగాల అధిపతులతో, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ ఆశయ సాధనకు ఐక్యంగా కృషి చేయాలి



**కాకినాడ, పెన్ సత్తా, జూలై 18**కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి దివంగత ముద్రగడ పద్మనాభం ఆశయాలను సాకారం చేసేందుకు అన్ని వర్గాలు ఐక్యంగా కృషి చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. రాజ్యాధికార సాధన కోసం ఎస్సీ, బీసీ వర్గాలను కలుపుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. శనివారం కాకినాడలోని శుభం కాపు కళ్యాణ మండపంలో ఆంధ్ర కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా నిర్వహించిన ముద్రగడ సంతాప సభలో పలువురు నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ మరణాన్ని రాజకీయాలకు వినియోగించవద్దని, ఆయన ఆశయ సాధన కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని కొనసాగించాలని సూచించారు. విజయవాడలో రాష్ట్రస్థాయి సంతాప సభ నిర్వహించాలని, ముద్రగడకు చిరస్థాయిగా గుర్తుండే విధంగా మహోన్నత కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కాకినాడ జిల్లాలో కాపు సామాజిక వర్గం అధికంగా ఉన్నందున జిల్లాకు ముద్రగడ పద్మనాభం పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ముద్రగడ విగ్రహాలు ఏర్పాటు చేసి ఆయన సేవలను చిరస్మరణీయంగా నిలపాలని అభిప్రాయపడ్డారు. 1978లో ఎమ్మెల్యేగా ఎన్నికైన ముద్రగడ పద్మనాభం నీతి, నిజాయితీ, ముక్కుసూటితనంతో రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని, అదే కారణంగా ఎన్నో ఉన్నత పదవులను కోల్పోయారని వక్తలు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో ముద్రగడపై అనవసర వ్యాఖ్యలు చేయవద్దని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు,మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు,ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు, కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్, బీసీ సంఘం నాయకుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, బూరిగా ఆశీర్వాదం,ఆకుల రామకృష్ణ, కల్వకొలను తాతాజీ,బుర్ర అనుబాబు, రామదేవు సీతయ్య దొర,బీఎన్ మూర్తి, తుమ్మలపల్లి రమేష్,రామిరెడ్డి మురళి, రాగిరెడ్డి చంద్రకళ దీప్తి,పెద్దాడ సుబ్బారాయుడు,దుగ్గన బాబ్జి, అడ్డాల లక్ష్మి, మజ్జి పద్మావతి, కుంపట్ల మంగతాయారు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యం సాధించాలి



### నక్కపల్లి లో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణా తరగతులు
### మండలవిద్యాశాఖాధికారి కే.నరేష్

**నక్కపల్లి, పెన్ సత్తా జూలై18:** ఉపాధ్యాయులు బోధనా విధానంలో ఉత్తమ నైపుణ్యం సాధించాలని మండల విద్యాశాఖ అధికారి కే నరేష్ అన్నారు. స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు కేంద్రంగా శనివారం నాలుగు మండలాల ఉపాధ్యాయులకు బోధన లో భాగంగా ఒకరోజు వృత్యంతర శిక్షణా తరగతులను నిర్వహించారు. భాషేతర సబ్జెక్టులు (సైన్స్,గణితం, సోషల్ )లో ఈ విద్యాసంవత్సరంలో పాఠ్యపుస్తకాలలో చోటుచేసుకున్న సంస్కరణలపై పూర్తి స్థాయిలో అనుభవజ్ఞులైన రిసోర్స్ పర్సన్ లచే అవగాహన కల్పించినట్లు ఎం ఈ వో నరేష్ తెలిపారు. పాఠ్యపుస్తకాలలో సంస్కరణలతో పాటు లీప్ యాప్ లో సంస్కరణలు తదితర అనేక అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ తరగతులకు నక్కపల్లి, పాయకరావుపేట,యలమంచిలి,ఎస్.రాయవరం మండలాలనుండి 390 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం ఈ వో నరేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను,విజ్ఞానం, సాంకేతికత పరిజ్ఞానాన్ని నిరంతరం మెరుగుపరచుకునే ఒక అభ్యసన ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు .విద్యార్ధులకు మెరుగైన విద్యను అందించడం,కొత్త బోధనా పద్ధతులను నేర్చుకోవడం,వృత్తిపరమైన ఆత్మ విశ్వాసాన్ని ప్రతీ ఉపాధ్యాయుడు కల్పించుకోవాలని అన్నారు. తరగతి గదిలో డిజిటల్ టూల్స్,స్మార్ట్ బోర్డులు ,ఆన్ లైన్ రిసోర్స్ లను. ఏఐ సాంకేతికత వినియోగం ఈ తరగతులలో వివరించడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. విద్యార్ధులలో బట్టీ విధానానికి స్వస్తిపలికి సృజనాత్మకంగా ఆలోచించేలా తీర్చిదిద్దాలన్నారు. ఈ తరగతులకు పరిశీలకులుగా మండలవిద్యాశాఖాధికారి 2 రుత్తల నాగన్నదొర పర్యవేక్షించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పతివాడ విజయ, శ్రీలక్ష్మి శిక్షణా తరగతులకు ఏర్పాట్లు పూర్తిచేయడం తో పాటు అన్ని వసతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ లుగా గణితం లక్ష్మునాయుడు, భౌతికశాస్త్రం రిసోర్స్ పర్సన్ గా అబ్దుల్ ఖాదర్ వ్యవహరించారు.

# భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**నక్కపల్లి, పెన్ సత్తా, జులై :** ఏపీఐఐసీ భూసేకరణలో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నక్కపల్లి మండలం ఆర్ అండ్ ఆర్ కాలనీ లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కే.లోకనాధం తో కలిసి పర్యటించారు.

ఈ సందర్భంగా నిర్వాసితులు పలు సమస్యలను నాయకులు ద్రుష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు, కె.లోకనాధం మాట్లాడుతూ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కొరకు భూములు సేకరించి,గ్రామాలలో ఇళ్ళు నేలమట్టం చేసి నిర్వాసితులకు ఏ విధమైన సౌకర్యాలు కల్పించకుండా బలవంతంగా ఆర్ అండ్ ఆర్ కాలనీ కి తరలించారన్నారు.

నేటికి ఆర్ అండ్ ఆర్ కాలనీ లో విద్యుత్ వీధి లైట్లు ఏర్పాటు చేయలేదంటేనే ఈ ప్రభుత్వం నిర్వాసితుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్ధమౌతుందని ఆవేదన వ్యక్తంచేశారు.

ప్రభుత్వం ఇచ్చిన ఆర్ ఆర్ ప్యాకేజీ ఎనిమిది లక్షల తొంబై ఎనిమిది వేలు రూపాయలు చాలా తక్కువ అని,ఈ ప్యాకేజీ కూడా ఏ ప్రాతిపదికన నిర్ణయించారని, కోట్లాది రూపాయలు టర్నోవర్ కలిగిన కార్పోరేట్ కంపెనీకి అతి చౌకగా రెండు వేల రెండు వందల ఎకరాలు భూమి అప్పగించిన ప్రభుత్వం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు 8లక్షల తొంబై ఎనిమిది వేలు రూపాయలు మాత్రమే



ప్యాకేజీ ఇవ్వడం అత్యంత దారుణమన్నారు, రైతులు, నిర్వాసితులు త్యాగాలు వలనే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని చెపుతున్న ప్రభుత్వం ఆ త్యాగాలు చేసిన నిర్వాసితులను, రైతులను అందుకోవడం లో తీవ్ర మైన నిర్లక్ష్యం చూపుతుందని తెలిపారు. ప్రస్తుతం స్వంత గ్రామాలలో ఇళ్ళు కోల్పోయి, ఆర్ అండ్ ఆర్ కాలనీ లో ఇళ్ళు నిర్ణయించుకుంటున్న నిర్వాసితులకు ప్రస్తుతం జీవనోపాధి లేక ఉపాధి లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కంపెనీలో ఉద్యోగం ఇచ్చే వరకు ప్రతీ కుటుంబానికి నెలకు పదివేల రూపాయలు జీవన బ్రృతి కల్పించాలని కోరారు. వివాహం అయిన ఆడ పిల్లలకు ప్యాకేజీ ఇవ్వకపోవడం చట్ట విరుద్ధం అని తెలిపారు. వెంటనే నిర్వాసితులు అందరికీ ఇంటి అద్దెలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్, ఎం.మహేష్ బాబు,బి.అప్పలరాజు, ఎం.నానాజీ,కె.దేముళ్ళు, దుర్గ,భవానీ,శివమ్మ తదితరులు పాల్గొన్నారు

# ప్రతి కార్యకర్తతో అనుసంధానమే లక్ష్యం

- **“జగన్ 2.0 సూపర్ యాప్” పోస్టర్లను ఆవిష్కరించిన ఇంచార్జి దద్దాల**
- **ప్రతి ఒక్కరూ ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని కార్యకర్తలకు పిలుపు**

**కనిగిరి, పెన్ సత్తా, జూలై 18:**వైఎస్సార్సీపీ కార్యకర్తలను పార్టీ నాయకత్వంతో అనుసంధానిస్తూ, సమాచార మార్పిడి, సమస్యల పరిష్కారం, పార్టీ కార్యక్రమాలను ఒకే వేదికపైకి తెచ్చే లక్ష్యంతో రూపొందించిన “జగన్ 2.0 సూపర్ యాప్” పోస్టర్లను కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతి కార్యకర్త ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం దద్దాల నారాయణ యాదవ్ మీడియా తో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు,సోషల్ మీడియా సభ్యులను వేదిస్తోందని,జగన్ 2.ా సూపర్ యాప్ ద్వారా ప్రభుత్వ చర్యలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తూ అణచివేసే ధోరణిలో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పార్టీలో మనము



నిర్వహించే ప్రతి సమావేశం,ప్రెస్ మీట్లు,ముఖ్యమైన కార్యక్రమాలు, ప్రకటనలు అన్ని ఈ యాప్ లో లైవ్ ఫీడ్ ద్వారా ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటుందని దద్దాల నారాయణ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్,మడతల కస్తూరి రెడ్డి, సూరసాని మోహన్ రెడ్డి,ఓ కె రెడ్డి,యక్కంటి శ్రీనివాసుల రెడ్డి, గోపవరపు బొర్రారెడ్డి,రాచపూడి మాణిక్యరావు,గూడూరి అబ్రహం లింకన్,పులి శాంతి,అయిమల్ల నాగమణి,యర్రబల్లి దేవరాజు,పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి,సిరుప గోవర్ధన్ రెడ్డి,డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, మూలే గోపాల్ రెడ్డి,డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ,దాదిరెడ్డి మాలకొండరెడ్డి,వైసీపీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రారంభం: దశాబ్దాల డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం.

**నర్సీపట్నం పెన్ సత్తా, జూలై 18**నర్సీపట్నం పురపాలక సంఘ పరిధిలో దశాబ్దాలుగా వేధిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 నిధులతో లింగాపురం బ్రిడ్జి సమీపంలో రూ.3.05 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక తడి, పొడి వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. గుడివాడ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో దీనిని ప్రారంభించగా, స్థానికంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, శాసనసభ స్పీకర్ సతీమణి చింతకాయల పద్మావతి కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

అభివృద్ధి బాటలో నర్సీపట్నం

ఈ సందర్భంగా చింతకాయల పద్మావతి మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీని గ్రేడ్-1గా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పట్టణంలోని 28 వార్డులు డంపింగ్ యార్డులను తలపించేలా ఉండేవని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్పీకర్ అయ్యన్నపాత్రుడి ప్రత్యేక చొరవతో సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు.

?ఈ ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను జిందాల్ కంపెనీకి అప్పగించామని, వీఎంఆర్డీఏ నిధుల నుంచి రూ.4.11 కోట్లు, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ నుంచి రూ.3.05 కోట్లు వెచ్చించామని వివరించారు. గత రెండేళ్లలో పట్టణ మౌలిక సదుపాయాల కల్పనకు రూ.32 కోట్లు ఖర్చు చేశామని, చెత్త సేకరణ కోసం ప్రత్యేక వాహనాలను, పుష్ కార్ట్‌లను అందుబాటులోకి తెచ్చామని ఆమె తెలిపారు.

స్పందించిన కలెక్టర్.. అధికారులకు ఆదేశాలు

డంపింగ్ యార్డ్ వద్ద రిటైనింగ్ వాల్ లేకపోవడం వల్ల వర్షాకాలంలో సమీపంలోని ఉత్తర్వాహిని నది కలుషితమవుతోందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు చింతకాయల రాజేష్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ విజయకృష్ణన్, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రజలంతా తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి పారిశుద్ధ్య కార్మికులకు అందించడం ద్వారా పరిశుభ్రమైన నర్సీపట్నం నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ సూర్యచంద్ర, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, ఆర్డీవో వి.వి. రమణ, తహశీల్దార్ రామారావు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# నేతన్నను మరిచిన కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వంలో నేతన్నలకు రెండేళ్లు గుండు సున్నా
బాబు గారి మాట... నీటి మీద రాత ఒక్కటే
వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ ధ్వజం

నేతన్నల సంక్షేమానికి వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నిరంతర భరోసా కల్పిస్తే, కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా చేనేత కుటుంబాలను పూర్తిగా విస్మరించిందని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్, పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు.జగన్ ప్రభుత్వం 2019-20 నుంచి 2023-24 వరకు వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రతి అర్హతగల చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల చొప్పున ఐదు విడతల్లో మొత్తం రూ.1.20 లక్షలు అందించిందన్నారు. సుమారు 80 వేల కుటుంబాలకు రూ.969.77 కోట్లకు పైగా నేరుగా వారి ఖాతాల్లో జమ చేసి దేశంలోనే ఆదర్శ సంక్షేమ పథకంగా నిలిపిందన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా నేతన్న నేస్తం అమలు ఆగలేదని గుర్తు చేశారు.ఎన్నికల ముందు జగన్ అమలు చేసిన ప్రతి సంక్షేమ పథకాన్ని కొనసాగిస్తామని, అంతకంటే మెరుగ్గా అమలు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన వెంటనే నేతన్న నేస్తాన్ని నిలిపివేశారని ఆరోపించారు. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడంతో ప్రతి అర్హతగల నేతన్న కుటుంబం రూ.48 వేల మేర నష్టపోయిందన్నారు. ఇప్పుడు నేతన్న భరోసా పేరుతో రూ.25 వేల సాయం ఇస్తామని ప్రచారం చేస్తూ, రెండేళ్లుగా ఇవ్వాల్సిన రూ.48 వేల బకాయిని పూర్తిగా దాచిపెడుతున్నారని విమర్శించారు. జగన్ ఇచ్చిన రూ.24 వేలపై కేవలం రూ.1,000 పెంచామని చెప్పడం కంటే ముందు, రెండేళ్లుగా నిలిపివేసిన సాయాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో 80,686 కుటుంబాలు లబ్ధి పొందగా, ప్రస్తుతం కేవలం 54 వేల మందినే అర్హులుగా గుర్తించడం దారుణమన్నారు. ప్రభుత్వం మరోవైపు రాష్ట్రంలో 93 వేల చేనేత కుటుంబాలు ఉన్నాయని చెబుతూనే, నగదు సాయానికి మాత్రం 54 వేల మందినే ఎంపిక చేయడం ఏ విధమైన భరోసా అని ప్రశ్నించారు.మగ్గం, విద్యుత్ కనెక్షన్, జియో ట్యాగింగ్, వృత్తి ధ్రువీకరణ వంటి కొత్త నిబంధనల పేరుతో నిజమైన నేతన్నలను పథకం నుంచి తొలగించే ప్రయత్నం చేస్తే వైఎస్ఆర్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు.నిజంగా నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమైతే, 2024-25 మరియు 2025-26 సంవత్సరాలకు సంబంధించిన బకాయిలతో కలిపి ప్రతి అర్హతగల నేతన్న కుటుంబానికి రూ.50 వేల చొప్పున వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

జగన్ హయాంలో నేతన్న నేస్తం అమలు

| ఆర్థిక సంవత్సరం | లబ్ధిదారుల కుటుంబాలు | ఒక్కో కుటుంబానికి | విడుదల చేసిన మొత్తం |
|---|---|---|---|
| 2019-20 | 79,000 | రూ.24,000 | రూ.189.53 కోట్లు |
| 2020-21 | 81,024 | రూ.24,000 | రూ.194.46 కోట్లు |
| 2021-22 | 80,032 | రూ.24,000 | రూ.192.08 కోట్లు |
| 2022-23 | 80,546 | రూ.24,000 | రూ.193.31 కోట్లు |
| 2023-24 | 80,686 | రూ.24,000 | రూ.193.64 కోట్లు |



మొత్తం ఐదు విడతల్లో:
ఒక్కో కుటుంబానికి: రూ.1.20 లక్షలు
మొత్తం విడుదల: సుమారు రూ.969.77 కోట్లు

ప్రభుత్వానికి సూటి ప్రశ్నలు

2024-25 ఆర్థిక సంవత్సరానికి నేతన్న భరోసా ఎందుకు ఇవ్వలేదు?

2025 ఆగస్టులో రూ.25 వేల సాయం ప్రకటించి, ఏడాది గడిచినా ఎందుకు అమలు చేయలేదు?

ఇప్పుడు ప్రకటిస్తున్న రూ.25 వేల సాయం ఏ ఆర్థిక సంవత్సరానికి సంబంధించినది?

గత రెండేళ్లకు సంబంధించిన రూ.48 వేల బకాయిని ప్రభుత్వం చెల్లిస్తుందా? లేదా?

జగన్ ప్రభుత్వంలో 80,686 కుటుంబాలకు సాయం అందితే, ఇప్పుడు కేవలం 54 వేల మందినే ఎందుకు ఎంపిక చేశారు?

ప్రభుత్వం చెప్పిన 93 వేల చేనేత కుటుంబాల్లో మిగిలిన దాదాపు 39 వేల కుటుంబాలకు న్యాయం ఎప్పుడు జరుగుతుంది.? అని విజయ భాస్కర్ కూటమి ప్రభుత్వంపై ధ్యాజమెత్తరు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పురం హరినాద్.పట్టణ చేనేత అధ్యక్షుడు పురం శ్రీరాములు, పాల్గొన్నారు

# వైసీపీని వీడి టీడీపీలోకి 20 కుటుంబాలు సామూహిక చేరిక

- కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించిన యువ నాయకులు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు
- ప్రజల్లో ఆత్మీయ విశ్వాసం నింపడమే బలం మండల అభివృద్ధిపై టీడీపీ ప్రత్యేక దృష్టి సారించింది
- ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : కిమిడి రామ్ మల్లిక్ నాయుడు
- అంతర్గత రోడ్ల నిర్మాణం , నీటి పారుదల సౌకర్యాలకు కృషి : మాజీ ఎంపీపీ ,జిల్లా టిడిపి రైతు అధ్యక్షులు పైల బలరాం

గరివిడి మండలం, దేవాడ గ్రామ పరిధిలోని చీపురుపల్లి క్యాంప్ కార్యాలయంలో తెలుగు దేశం పార్టీ శ్రేణులకు మరో పటిష్టమైన బలం చేకూరింది. గ్రామంలోని ప్రముఖ వ్యక్తి మహంతి వాసు ఆధ్వర్యంలో 20 కుటుంబాలు భారీగా తెలుగుదేశం పార్టీలో చేరాయి.కొత్తగా చేరిన వారికి చీపురుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు తనయుడు ,యువ నేత, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు పార్టీ కండువా కప్పి, పార్టీ సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆత్మీయ విశ్వాసమే టిడిపి బలమని అన్నారు. దేవాడ గ్రామ ప్రజలు చూపిన ఈ నమ్మకాన్ని మేము కాపాడుకుంటామని ,రాష్ట్ర ప్రభుత్వంలో టిడిపి ప్రజా సంక్షేమ పథకాల అమలులో ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. ఇటీవల ప్రకటించిన అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు , పింఛన్ పెంపు వంటి నిర్ణయాలు దళిత, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి ఉపయోగపడతాయన్నారు. ఈ ప్రభుత్వ విధానాల వల్లనే ప్రజలు మా వైపు ఆకర్షితులవుతున్నారనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ,





జిల్లా తెలుగుదేశం పార్టీ రైతు అధ్యక్షులు పైల బలరాం పాల్గొని కొత్త సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గరివిడి మండలం అభివృద్ధి పట్ల టిడిపి ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, మండలంలోని అంతర్గత రోడ్ల నిర్మాణం, నీటిపారుదల సౌకర్యాల కల్పనకు పార్టీ కృషి చేస్తుందన్నారు. ఇవన్నీ ప్రజల ఓటు వల్లే సాధ్యమవుతాయన్నారు.టిడిపి గరివిడి మండల అధ్యక్షులు సారిపాక సురేష్ మాట్లాడుతూ దేవాడ గ్రామంలో రాబోయే పంచాయతీ ఎన్నికల్లో టిడిపి త్రివర్ణ పతాకం ఎగురవేస్తుందన్నారు. ఈ 20 కుటుంబాల చేరిక మా బలాన్ని మరింత పెంచిందన్నారు.కొత్తగా చేరిన కుటుంబాల తరపున మహంతి వాసు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, నియోజకవర్గ అభివృద్ధి పనులు చూసి మేమంతా కలిసి టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నామన్నారు. పార్టీ మాకు అన్ని విధాల అండగా ఉంటుందని నమ్మకం ఉందన్నారు.టిడిపి శ్రేణులు ఈ చేరికను స్వాగతిస్తూ, భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త సభ్యులందరికీ పార్టీ తరపున ఘన స్వాగతం పలికారు.

# మాధవరం సర్పంచ్ రేసులో కసినేని వీరమల్లు నాయుడు

-తెదేపాలో కీలక పాత్ర పోషిస్తున్న కసినేని కుటుంబం
-అన్ని వర్గాల ప్రజలకు సహాయ సహకారాలు అందించడంలో ముందంజ

రాయచోటి నియోజకవర్గంలోని మాధవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ రేసులో ప్రముఖ తెదేపా నేత కసినేని వీరమల్లు నాయుడు ముందంజలో ఉన్నారు. రాయచోటిలో తెదేపాను బలోపేతం చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఈయన, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ తరపున సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతుండడంతో రాయచోటి నియోజకవర్గంలో ఈ కసినేని వీరమల్లు నాయుడు సర్పంచ్ రేస్ హాట్ టాపిక్ గా మారింది. సర్పంచ్ అభ్యర్థిగా కీలక పాత్ర పోషిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

**రాజకీయ నేపథ్యం:** పార్టీ ఆవిర్భావం నుంచి వీరి కుటుంబంశీ పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు.గతంలో వైకాపా ప్రభుత్వంలో టీడీపీ పార్టీకి క్రియాశీలకంగా పనిచేసిన కసినేని వీరమల్లు నాయుడు టీడీపీ కార్యకర్తల, నాయకులు తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు.తెదేపా అధిష్టానం, స్థానిక నేతల సహకారంతో ఆయన రాజకీయంగా బలపడ్డారు. మాధవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీని పటిష్టం చేయడానికి కసినేని నిరంతర కృషి చేస్తున్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటు న్నారు. రాయచోటి మండలనికి చెందిన ఇతర కూటమి నాయకులతో కలిసి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. మాధవరం సర్పంచ్ రేసులో ప్రాధాన్యత: రాయచోటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత శక్తివంతం చేయాలన్న లక్ష్యంతో ఆయన స్థానిక ప్రజలతో, పార్టీ కార్యకర్తలతో నిరంతరం మమేకమవుతున్నారు. ఈ పరిణామాలు ఆయన్ను మాధవరం రేసులో తెదేపా తరపున అత్యంత పలువురు నిలుపుతున్నారు. మాధవరం మేజర్ పంచాయతీలో తెదేపా పార్టీ క్యాడర్ బలంగా ఉండటం, కూటమి నాయకులు, కార్యకర్తలు పూర్తి భరోసా ఉండటం ఆయనకు కలిసివచ్చే అంశం. రాజకీయంలోకి టీడీపీ ఆవిర్భావం సమయం లోనే ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. రాయచోటి మండలంలో పలు గ్రామాల్లో సొంత డబ్బులతో మంచినీటి ట్యాంకర్లను నీటిని సరిపడా చేశారు.. పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కసినేని కుటుంబ సభ్యులు ముందంజలో ఉంటారు. రాజకీయంగా ఎంతో చైతన్యం ఉన్న రాయచోటి లో కసినేని వీరమల్లు నాయుడు



నిలబడటం తధ్యమని పలువురు చర్చించుకుంటున్నారు. తెదేపా జిల్లా పార్టీ ,నియోజకవర్గ ఇన్చార్జిలతో చర్చలు: ఇటీవల తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ తో కూడా సర్పంచ్ పై పావులు కలిపినట్లు విశ్వసనీయ వర్గాల నుండి సమాచారం.నారా లోకేష్,జిల్లా పార్టీ నాయకత్వం హామీ ఇచ్చినట్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న టిడిపికి చెందిన బడా నాయకులు కూడా మద్దతు తెలిపినట్లు తెలిసింది. కసినేని వీరమల్లుకు సర్పంచ్ పదవిపై అభయ హస్తం రావడంతో కొందరు వలస నాయకులు జీర్ణించు కోలేక పోతున్నారు.

# ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా సాంబశివ ఎన్నిక

విజయవాడ లో జరిగిన ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశంలో ప్రస్తుతం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గా పనిచేస్తున్న సాంబశివ ను ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సాంబశివ, మాట్లాడుతూ జూలై 18న విజయవాడలో జరిగిన ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశంలో నన్ను ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకోవడం పట్ల రాష్ట్ర నాయకత్వానికి, రాష్ట్ర సమితి సభ్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.నాపై ఉంచిన ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తాను. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల సాధన కోసం, కనీస వేతనాల అమలు, కాంట్రాక్టు-ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కార్మిక వ్యతిరేక విధానాల రద్దు కోసం




ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మరింత సమర్థవంతంగా ఉద్యమాలు నిర్వహించేందుకు కృషి చేస్తాను.అన్నమయ్య జిల్లాలో ఏఐటీయూసీని మరింత బలోపేతం చేసి, ప్రతి కార్మికుడి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రతి రంగంలోని కార్మికులను సంఘటితం చేసి ఉద్యమాలను విస్తృతం చేస్తామని తెలిపారు

## రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు పై శిక్షణ కార్యక్రమం.



శ్రీకాకుళం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ ) పథకములో భాగముగా పాతపట్నం మండలం, కోదూరు గ్రామంలో రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు పై శిక్షణ మరియు అవగాహన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా రైతు శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీ. ఆర్. శ్రీనివాసరావు, వ్యవసాయ పరిశోధన స్థానం, రాగోలు శాస్త్రవేత్త డా. పి. ఉదయబాబు, కృషి విజ్ఞాన కేంద్రం, ఆమదాలవలస శాస్త్రవేత్త డా. ఎస్. కిరణ్ కుమార్, రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీ వై సురేష్, పాతపట్నం మండల వ్యవసాయ అధికారి శ్రీ కె. సింహాచలం, గ్రామ పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు మరియు శాస్త్రవేత్తలు ఎల్ నినో ప్రభావం, పంటల మార్పిడి ఎ పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు పై సవివరంగా తెలియపరిచారు.అదే విధముగా నేల ఆరోగ్యాన్ని కాపాడడంలో భాగంగా సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులు, జీవన ఎరువులు ప్రాముఖ్యతను వివరిస్తూ రసాయన ఎరువులు వినియోగాన్ని తగ్గించుకోవాలని మరియు మోతాదుకు మించి వాడకూడదని వివరించడం జరిగింది.అదేవిధంగా వరి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించడం వారి సమస్యలకు పరిష్కారం చెప్పడం జరిగింది డ్రోన్ ద్వారా నానో ఎరువుల స్ప్రేయింగ్ చేసుకోవాలని రైతులకు సూచించడమైనది.

## పొందూరు ఎస్. ఐ గా నూతన బాధ్యతలు చేపట్టిన జి రాజేష్

- మండలంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం : ఎస్. ఐ రాజేష్



పొందూరు మండల నూతన ఎస్. ఐ గా జి రాజేష్ శనివారం నూతన బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఎచ్చెర్ల , రణస్థలం , కంచిలి మెలియపుట్టి , సి.సి.ఎస్ స్టేషన్లలో ఎస్. ఐ గా విధులు నిర్వహించారు. పొందూరు లో ఎస్. ఐగా విధులు నిర్వహించిన సత్యన్నారాయణ రణస్థలంకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పొందూరు నూతన ఎస్. ఐ గా జి రాజేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్. ఐ జి రాజేష్ మాట్లాడుతూ ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని , చట్టాన్ని గౌరవించే ప్రతీ పౌరుడికి పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తామన్నారు. నేరాలు అసాంఘిక కార్యకలాపాలు ,అక్రమ రవాణాలు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానస్పద వ్యక్తుల లేదా సంఘటనలు గమనించినట్లయితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## వైదల్యం కలిగిన విద్యార్థులకు వీల్ చైర్స్ పంపిణీ చేసిన ఎంఈఓ 2 శోభారాణి



కౌతాళంలోని భవిత సెంటర్ కు 2025-26 సంవత్సరానికి గాను 13 మంది ప్రత్యేక అవసరాలు పిల్లలకు ఉపకరణాలు రావడం జరిగినది. సమగ్ర శిక్ష అభియాన్ వారు అలిమ్కో మెడికల్ క్యాంపు నిర్వహించి వైకల్యం కలిగిన పిల్లలకు వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్స్ టి.ఎల్.ఎమ్ కిడ్స్ రావడం జరిగింది. వీటిని ఎంఈఓ శోభారాణి మేడం చేతుల మీరగా వాటిని పంపిణీ చేయడం జరిగింది. అందులో భాగంగా మేడం మాట్లాడుతూ మన మండలంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు మెడికల్ క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 శోభ రాణి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు త్రివేణి, మరియు ఐఆర్టీ అయినటువంటి షబానా పర్వాన్, సాయికుమార్ మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఇంటికి స్వయంగా విచ్చేసిన మంత్రి మండిపల్లి



మండలంలోచింతకుంట పల్లెకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త సయ్యద్ రిజ్వాన్ , సయ్యద్ తౌసేప్ దంపతులు ఇటీవల కాలంలో మగ బిడ్డకు జన్మించారు.దీంతో లక్కిరెడ్డిపల్లి మండలం లో పర్యటిస్తున్న రాష్ట్ర యువజన, క్రీడా, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి సహచరులు సమాచారం అందించడంతో నేరుగా చింతకుంట పల్లెలోని వారి ఇంటికి వెళ్లి బిడ్డను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆశీర్వదించడంతో కుటుంబ సభ్యులు మంత్రి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.టిడిపి లో ఉన్న ఒక చిన్న కార్యకర్తను గుర్తించి స్వయంగా తన ఇంటికి మంత్రి రావడంతో రిజ్వాన్ కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

RNI:APTEL/2023/87729
ప్రశ్నించడం అందరి హక్కు..
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily
ఆదివారం 19 జులై 2026

## సంపాదకీయం

రాష్ట్ర విభజన గాయాలు, రాజధాని లేమి, అప్పుల భారంవంటి ప్రతికూలతల నడుమనుంచి ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల గమ్యస్థానంగా పరుగులు తీస్తోందనడానికి తాజా తార్కాణం -నీతి ఆయోగ్ తొలిసారిగా విడుదల చేసిన 'ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ 2026'. క్రిసిల్ నాలెడ్జ్ పార్టనర్‌గా రూపొందిన ప్రతిష్ఠాత్మక సూచీలో దేశంలోని 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలను మౌలిక వసతులు, వ్యాపార వాతావరణం, వనరులు, ప్రభుత్వ విధానాలు, నియంత్రణ సౌలభ్యం, ఆర్థిక ఆరోగ్యం, సంస్థాగత వాతావరణం, పర్యావరణ స్థిరత్వం అనే ఎనిమిది పిల్లర్ల ప్రాతిపదికన, 84 సూచికలతో సమగ్రంగా మదింపు చేశారు. 1,850కి పైగా వ్యాపార సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం నివేదిక విశ్వసనీయతకు నిలువుటద్దం! ఇందులో ఆంధ్రప్రదేశ్ 48.7 స్కోరుతో దేశవ్యాప్తంగా ఎనిమిదో స్థానం, 17 పెద్ద రాష్ట్రాల విభాగంలో ఆరోస్థానం కైవసం చేసుకుని 'ఫ్రంట్‌రన్నర్' హోదాను సగర్వంగా సాధించింది. గుజరాత్ (56.6), మహారాష్ట్ర (53.7), తమిళనాడు (53.3), ఒడిశా (52.4), మధ్యప్రదేశ్ (48.9) వంటి పారిశ్రామిక దిగ్గజాల సరసన -దశాబ్దకాలంగా పునర్నిర్మాణ దశలో ఉన్న నవ్యాంధ్ర నిలబడటం మామూలు విషయం కాదు. కర్ణాటకవంటి ఐటీ అగ్రగామి రాష్ట్రంతో సమానంగా స్కోరు సాధించడం మరో విశేషం. గతంలో కేంద్ర ప్రభుత్వ 'బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్' ర్యాంకింగుల్లో వరుసగా అగ్రస్థానంలో నిలిచిన చరిత్ర ఏపీ సొంతం. మధ్యలో వైకాపా పాలనలో పెట్టుబడుల విశ్వాసం సన్నగిల్లి రాష్ట్రం వెనుకంజలో పడిన మాట వాస్తవం. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టాక 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నినాదంతో సీఎం చంద్రబాబు సాగిస్తున్న పెట్టుబడుల యజ్ఞం -17 నెలల్లోనే 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల కల్పన రూపంలో ఫలించడం మొదలైంది. దావోస్ వేదికగా ప్రపంచ ఆర్థిక సదస్సులో, విశాఖ వేదికగా సీఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రం ఆకర్షించిన అంతర్జాతీయ దృష్టి ఇప్పుడు నీతి ఆయోగ్ గణాంకాల్లో ప్రతిఫలించిందనడంలో అతిశయోక్తి లేదు. ఈ తొలి జాతీయ సూచీలో దక్కిన 'ఫ్రంట్‌రన్నర్' గుర్తింపు -పెట్టుబడిదారుల దృష్టిలో రాష్ట్ర ప్రతిష్ఠను పెంచే విశ్వసనీయ ముద్ర!


నివేదికలో ఏపీ బలాలుగా నిలిచిన అంశాలు రాష్ట్ర భవిష్యత్తుపై భరోసా కల్పించేవే. తలసరి డిజిటల్ లావాదేవీల్లో దాదాపు 18 లావాదేవీలతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. పెద్ద రాష్ట్రాల సగటు 4.8తో పోలిస్తే ఇది దాదాపు నాలుగు రెట్లు! పాలనలో సాంకేతికతను వినియోగించడంలో రాష్ట్రం ఎంత ముందంజలో ఉందో చెప్పడానికి ఈ ఒక్క గణాంకం చాలు. రోజుకు సగటున 23.71 గంటల నిరంతర విద్యుత్ సరఫరా (కేటగిరీ సగటు 22.7 గంటలు), 14 శాతానికే పరిమితమైన ట్రాన్స్‌మిషన్-డిస్ట్రిబ్యూషన్ నష్టాలు (పెద్ద రాష్ట్రాల సగటు 18 శాతం) -పరిశ్రమలకు అత్యంత కీలకమైన ఇంధన రంగంలో ఏపీ సాధించిన నాణ్యతకు నిదర్శనాలు. దేశ నాన్-మెటాలిక్ ఖనిజ ఉత్పత్తి విలువలో దాదాపు పది శాతం వాటా, పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో దేశంలో ఐదోస్థానం రాష్ట్ర సహజ వనరుల పుష్కలతను చాటుతున్నాయి. అన్నింటికన్నా గర్వకారణం -ఉన్నత విద్యలో స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం) నమోదుల వాటా 48 శాతంతో

### మరింత ఉత్సాహంగా..!

దేశంలోనే అత్యధికం కావడం. రేపటి పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్య మానవ వనరుల గని ఏపీలో సిద్ధంగా ఉందని ఇది ప్రపంచానికి చాటే సందేశం. ఇన్వెస్టర్ల అభిప్రాయ సేకరణలోనూ రాష్ట్రానికి ప్రశంసలే దక్కాయి. విశాఖపట్నం పోర్టు, విస్తరిస్తున్న నౌకాశ్రయాల వల, శ్రీసిటీ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలు, పటిష్ఠమైన కోల్డ్ స్టోరేజీ వసతులను పెట్టుబడిదారులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. వెయ్యి కిలోమీటర్లకు పైబడిన సుదీర్ఘ తీరరేఖ, తలసరి రూ.1.61 లక్షల జీఎస్‌డీపీ, జీవీఏలో 58.6 శాతానికి చేరిన సేవారంగం వాటా -రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిణతి చెందుతున్న తీరుకు సంకేతాలు. ఫుడ్ ప్రాసెసింగ్, రసాయనాలు, ఫార్మా రంగాలను కీలక వృద్ధి చోదకాలుగా నివేదిక గుర్తించడం -ఇప్పటికే ఆ దిశగా డ్రోన్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, సెమీకండక్టర్, రక్షణ కారిడార్లను అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర వ్యూహానికి ఊతమిచ్చేదే. నీతి ఆయోగ్ ప్రత్యేకంగా రూపొందించిన 'ఎనర్జీ ట్రాన్సిషన్ బ్లూప్రింట్' ద్వారా రూ.7.5 లక్షల కోట్ల ఇంధన పెట్టుబడులతో ఏపీని దేశ టాప్-3 పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రణాళిక సిద్ధమవుతున్న వేళ -ఈ సూచీ రాష్ట్రానికి రెట్టింపు ఉత్సాహం!

విజయాలను వేడుక చేసుకుంటూనే -అగ్రస్థానానికీ, మనకూ మధ్యనున్న అంతరాన్ని నిజాయతీగా గుర్తించడం వివేకవంతమైన లక్షణం. గుజరాత్ స్కోరు 56.6తో పోలిస్తే ఏపీ 48.7 వద్దే ఉంది. ఈ ఎనిమిది పాయింట్ల వ్యత్యాసాన్ని పూడ్చుకుంటేనే 'ఫ్రంట్‌రన్నర్' నుంచి 'టాప్ పెర్ఫార్మర్' హోదాకు ఎదగగలం. మొత్తం సూచీలో 25 శాతం వెయిటేజీ ఉన్న మౌలిక వసతుల పిల్లర్‌లో ఏపీ మెరుగ్గా ఉన్నా -గుజరాత్ స్థాయి పోర్టు నిర్వహణ సామర్థ్యం, పోటీతత్వంతో కూడిన పారిశ్రామిక విద్యుత్ ధరలను అందుకోవాల్సి ఉంది. 20 శాతం వెయిటేజీ గల వ్యాపార వాతావరణం విభాగంలో మహారాష్ట్ర తరహా ప్రయివేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ పెట్టుబడుల ప్రవాహాన్ని ఆకర్షించడం, స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడం రాష్ట్రం ముందున్న తక్షణ కర్తవ్యాలు. తుపానులు, వరదల ముప్పు అధికంగా ఉండే తీర రాష్ట్రంగా పర్యావరణ స్థిరత్వ పిల్లర్‌లో తమిళనాడు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడం, వాతావరణ మార్పులను తట్టుకునే మౌలిక వసతుల నిర్మాణంపై దృష్టి సారించడం అవసరం. నియంత్రణ సౌలభ్యం, సంస్థాగత వాతావరణంలో ఛత్తీస్‌గఢ్ నుంచి, ప్రభుత్వ విధానాల్లో మధ్యప్రదేశ్ నుంచి నేర్వదగిన పాఠాలున్నాయని నివేదికే సూచిస్తోంది. రాష్ట్రాలు పరస్పరం ఉత్తమ విధానాలను అనుసరించేందుకు ఉద్దేశించిన 'రిఫార్మ్ టూల్'గా ఈ సూచీని నీతి ఆయోగ్ అభివర్ణించిన నేపథ్యంలో -ఏపీ దీన్ని ఆత్మపరిశీలన అద్దంగానే స్వీకరించాలి. 2023-24లో 92.13 మిలియన్ డాలర్లకే పరిమితమైన ఎఫ్‌డీఐలను గణనీయంగా పెంచుకోవడం, ప్రకటిత పెట్టుబడులను క్షేత్రస్థాయిలో వేగంగా వాస్తవరూపంలోకి తేవడం -ఈ రెండింటిపైనే రాష్ట్ర భవిష్యత్ ర్యాంకు ఆధారపడి ఉంటుంది. స్వర్ణాంధ్ర-47 స్వప్నాన్ని ప్రకటించుకున్న ఏపీ -సూచీలో వెల్లడైన బలాలను పరుగుకు ఇంధనంగా, బలహీనతలను దిద్దుబాటు పాఠాలుగా మలచుకుంటే -వచ్చే నివేదికల్లో 'టాప్ పెర్ఫార్మర్స్' జాబితాలో నిలుస్తుందనడంలో సందేహం లేదు!

## పనికొచ్చే పలుకు



# భయం దాటాకే.. గెలుపు గడప!

'నువ్వు ఏ పని చేయడానికి భయపడతావో, ఆ పనిని తప్పకుండా చెయ్' -అంటాడు ప్రఖ్యాత అమెరికన్ తత్వవేత్త రాల్ఫ్ వాల్డో ఎమర్సన్. చిన్నమాటగా అనిపించినా.. జీవితాన్ని మలుపు తిప్పే సూక్తి శక్తి ఇది. మనిషి ఎదుగుదలకు అతి పెద్ద అడ్డుగోడ.. అవకాశాల లేమీ కాదు, ప్రతిభ లేమి అంతకంటే కాదు. భయం! వేదిక ఎక్కి మాట్లాడాలంటే భయం! కొత్త ఉద్యోగానికి దరఖాస్తు చేయాలంటే భయం! మనసులోని మాట బయటపెట్టాలంటే భయం! సొంతంగా ఏదైనా ప్రారంభించాలంటే భయం! ఇలా భయం ముసుగులో మనం వదిలేసిన అవకాశాలే.. ఏళ్లు గడిచాక 'అయ్యో, అనే నిట్టూర్పులవుతాయి. ఇక్కడ ఒక సూక్ష్మం గమనించాలి. భయమనేది ప్రమాదాన్ని సూచించే హెచ్చరిక మాత్రమే కాదు.. చాలాసార్లు ఎదుగుదల దిశను చూపించే దిక్సూచి కూడా. మనం దేనికి ఎక్కువగా భయపడతామో.. అక్కడే మన జీవితాన్ని మార్చే తలుపు ఉంటుందన్నది జీవిత సత్యం. స్టేజ్ ఫియర్ ఉన్నవాడు దాన్ని జయిస్తే గొప్ప వక్త కావొచ్చు. రిజెక్షన్ భయాన్ని దాటినవాడు గొప్ప వ్యాపారవేత్త కావొచ్చు. వైఫల్య భయాన్ని అధిగమించినవాడు సాహసికుడిగా చరిత్రకెక్కొచ్చు. అంటే భయం ఉన్న చోటే మన అసలైన సామర్థ్యం నిద్రపోతూ ఉంటుంది. దాన్ని తట్టిలేపాలంటే.. భయపడే పనినే ధైర్యంగా చేయాలి.

లైఫ్‌స్టయిల్ విషయానికొస్తే.. ఈ సూత్రం అద్భుతం. చాలామంది జీవితాలు 'కంఫర్ట్ జోన్' అనే బంగారు పంజరంలో బందీలవుతాయి. అదే ఉద్యోగం, అదే దినచర్య, అదే ఆలోచనలు.. మార్పు అంటే భయం. కానీ పంజరం ఎంత బంగారుదైనా, అది ఎగరడాన్ని ఆపేస్తుంది. రోజూ చిన్న చిన్న భయాలను జయించడం అలవాటు చేసుకుంటే చాలు.. జీవనశైలే మారిపోతుంది. ఉదయాన్నే లేవడానికి బద్ధకిస్తున్నారా? రేపటినుంచి అదే చేయండి. వ్యాయామం కష్టమనిపిస్తోందా? అదే మొదలెట్టండి. కొత్త నైపుణ్యం నేర్చుకోవడం కుదరదనిపిస్తోందా? ఈరోజే తొలి అడుగు వేయండి. ఇలా భయాన్ని, బద్ధకాన్ని ఎదిరించి చేసే ప్రతి చిన్న పనీ.. మెదడులో 'నేను చేయగలను' అనే నమ్మకపు పునాదిని బలపరుస్తుంది. మనస్తత్వ శాస్త్రవేత్తలు దీన్నే 'కాన్ఫిడెన్స్ కాంపౌండింగ్' అంటారు. ఒక భయాన్ని జయిస్తే వచ్చే ఆత్మవిశ్వాసం.. మరో పది భయాలను ఎదుర్కొనే శక్తినిస్తుంది.

అలాగని భయాన్ని పూర్తిగా చంపేయమని కాదు. భయంలేని మనిషి ఉండడు. వీరుడికీ, పిరికివాడికీ తేడా భయం ఉండటంలో కాదు.. భయంతో వ్యవహరించే తీరులో ఉంటుంది. పిరికివాడు భయానికి లొంగి వెనుదిరుగుతాడు. వీరుడు భయాన్ని భుజాన వేసుకునే ముందుకు నడుస్తాడు. ఈత రాని వాడు నీటిని చూసి పారిపోతే జీవితాంతం ఒడ్డునే మిగిలిపోతాడు. దిగి ప్రయత్నిస్తేనే అలలను జయించే కళ సాధిస్తాడు. అభ్యాసంతో భయం చిన్నదవుతుంది.. మనిషి పెద్దవాడవుతాడు. అందుకే ఈరోజే ఒక చిన్న ప్రయోగం చేయండి. మిమ్మల్ని ఎప్పటి నుంచో భయపెడుతున్న ఒక్క పనిని ఎంచుకోండి. అది ఫోన్ చేసి క్షమాపణ చెప్పడం కావొచ్చు.. సభలో చేయెత్తి ప్రశ్న అడగడం కావొచ్చు.. ఎన్నాళ్లుగానో వాయిదా వేస్తున్న ఆరోగ్య పరీక్ష కావొచ్చు. దాన్ని ఈరోజే చేసేయండి. చేసిన మరుక్షణం మీకో అద్భుతం అనుభవంలోకి వస్తుంది.. 'ఇంతేనా? దీనికా ఇన్నాళ్లు భయపడింది?' అనిపిస్తుంది. భయం అనేది దూరం నుంచి చూస్తే పర్వతం.. దగ్గరకెళ్లి తాకితే మంచు ముద్ద. ఎమర్సన్ మాటలోని మర్మమిదే. భయపడే పని చేయడం అంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడం కాదు.. మన లోపలి బలాన్ని బయటకు తీసుకురావడం. భయం గడప దాటిన ప్రతిసారీ.. జీవితం ఒక కొత్త గది తలుపు తెరుస్తుంది!


# ఎగుమతులకు కొత్త ఊపు...




భారత వాణిజ్య చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెర లేచింది. మూడేళ్లపాటు పధ్నాలుగు విడతల సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం కుదిరిన భారత్-బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా) నాలుగు రోజుల క్రితమే లాంఛనంగా అమల్లోకి వచ్చింది. జీ-7 కూటమిలోని ఒక అగ్రదేశంతో ఇండియా కుదుర్చుకున్న అత్యంత సమగ్ర వాణిజ్య ఒప్పందమిదే. బ్రెగ్జిట్ అనంతరం బ్రిటన్ సంతకం చేసిన అతిపెద్ద ద్వైపాక్షిక ఒడంబడికా ఇదే! 2025 మే 6న చర్చలు కొలిక్కి రాగా.. అదే ఏడాది జులై 24న లండన్ వేదికగా ఉభయ దేశాల ప్రధానుల సమక్షంలో సంతకాలు జరిగాయి. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో సామాజిక భద్రతకు సంబంధించిన 'డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్' (డీసీసీ)పైనా ఇరుపక్షాలు సంతకాలు చేశాయి. ఉభయ దేశాల పార్లమెంటరీ ఆమోదాలు, అంతర్గత ప్రక్రియలు పూర్తయి ఇప్పుడు రెండూ ఏకకాలంలో అమల్లోకి వచ్చాయి. సుంకాల తగ్గింపునకే పరిమితం కాకుండా సేవలు, పెట్టుబడులు, డిజిటల్ వాణిజ్యం, మేధో సంపత్తి హక్కులు, ప్రభుత్వ కొనుగోళ్లు, వృత్తి నిపుణుల రాకపోకల దాకా ముప్పై అధ్యాయాలతో విస్తరించిన ఈ ఒప్పందాన్ని 'బంగారు ప్రమాణ' ఒడంబడికగా వాణిజ్య వర్గాలు అభివర్ణిస్తున్నాయి. దీనికింద భారత ఎగుమతుల్లో దాదాపు 99 శాతం సరకు శ్రేణులకు బ్రిటన్ మార్కెట్లో సుంకరహిత ప్రవేశం లభిస్తుంది. ప్రాసెస్డ్ ఆహారాలపై 70 శాతం దాకా ఉన్న సుంకాలు, సముద్ర ఉత్పత్తులపై 21.5 శాతం, ఇంజినీరింగ్ వస్తువులు-వాహన విడిభాగాలపై 18 శాతం, తోలు-పాదరక్షలపై 16 శాతం, వస్త్రాలపై 12 శాతం సుంకాలు ఒక్క కలం పోటుతో తొలగిపోవడం మన ఎగుమతిదారులకు అపూర్వ అవకాశం. మరోవైపు డీసీసీ చలవతో బ్రిటన్‌లో తాత్కాలిక నియామకాలపై పనిచేసే భారతీయ నిపుణులు ఐదేళ్ల వరకు అక్కడి సామాజిక భద్రత చందాలనుంచి మినహాయింపు పొందుతారు. దీనివల్ల 75 వేలకుపైగా ఉద్యోగులు, తొమ్మిది వందలకు పైచిలుకు కంపెనీలు లబ్ధి పొందుతాయని అంచనా. ప్రస్తుతం సుమారు 56 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030నాటికి రెట్టింపు చేసి 112 బిలియన్ డాలర్లకు చేర్చాలన్నది ఉభయ దేశాల సంకల్పం. ఆ లక్ష్యం సాకారం కావాలంటే -తలుపులు తెరిస్తే సరిపోదు; గడప దాటి లోపలికి అడుగుపెట్టే సన్నద్ధత ఉండాలి!

గణాంకాలను పరిశీలిస్తే బ్రిటన్ మార్కెట్లో ఇండియా వాటా ఎంత స్వల్పమో, పెరగాల్సిన అవకాశం ఎంత అపారమో బోధపడుతుంది. గత ఏడాది బ్రిటన్ దాదాపు 92,890 కోట్ల డాలర్ల విలువైన వస్తు దిగుమతులు చేసుకోగా.. అందులో ఇండియా నుంచి వెళ్లినవి 1,520 కోట్ల డాలర్లు. అంటే రెండు శాతంలోపు. రంగాలవారీగా చూసినా ఇదే దుస్థితి. 2025లో బ్రిటన్ 2,130 కోట్ల డాలర్ల విలువైన దుస్తులను వివిధ దేశాల నుంచి తెప్పించుకుంటే, భారత వస్త్రాల వాటా కేవలం 130 కోట్ల డాలర్లు. ప్రపంచానికి 1,630 కోట్ల డాలర్ల దుస్తులను ఎగుమతి చేసే సత్తావున్న భారత్‌కు ఇది ఏమాత్రం సరిపోని అంకె. బంగ్లాదేశ్, వియత్నాంవంటి పోటీదారులు సుంకాల వెసులుబాట్లతో ఇన్నాళ్లూ దండుకున్న మార్కెట్‌ను -'సెటా' పుణ్యమా అని సమాన అవకాశాల వేదికపై ఇప్పుడు మనం అందిపుచ్చుకోవచ్చు. తోలు ఉత్పత్తులు, పాదరక్షల విభాగంలోనూ సుంకాల తొలగింపు మన చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కొత్త ఊపిరులూదుతుంది. ప్రాసెస్డ్ ఆహార విభాగం మరో బంగారు గని. బ్రిటన్ నిరుడు 3,340 కోట్ల డాలర్ల విలువైన ప్రాసెస్డ్ ఆహారాన్ని దిగుమతి చేసుకోగా అందులో ఇండియా వాటా 35.4 కోట్ల డాలర్లే. రెడీ-టు-ఈట్ వంటకాలు, బేకరీ, మిఠాయిలు, సాస్‌లు, సంప్రదాయ భారతీయ రుచులకు అక్కడి ప్రవాస భారతీయుల్లోనే కాదు, స్థానికుల్లోనూ ఆదరణ పెరుగుతున్న వేళ ఈ విభాగంలో మన వాటాను అనేక రెట్లు పెంచుకోవచ్చు. ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, సుగంధద్రవ్యాల దిగుమతుల్లో (2,320 కోట్ల డాలర్లు) ఇండియా వాటా 3.1 శాతమే కావడం, మాంసం-చేపల దిగుమతుల్లో (1,720 కోట్ల డాలర్లు) మన వాటా 12.6 కోట్ల డాలర్లకే పరిమితం కావడం.. వ్యవసాయ, మత్స్యరంగాల్లో మిగిలివున్న విస్తృతావకాశాలకు నిలువుటద్దం! ఇక బ్రిటన్ ఏటా 9,220 కోట్ల డాలర్ల విలువైన వాహనాలు, ద్విచక్ర వాహనాలు, విడిభాగాలను దిగుమతి చేసుకుంటుంటే అందులో భారత్ నుంచి వెళ్లేవి 32.5 కోట్ల డాలర్లే. సుంకాల ఉపశమనంతో ఈ రంగం దీర్ఘకాలంలో మనకు పెద్ద ఆదాయ వనరుగా మారే ఛాన్స్ ఉంది. యంత్రాలు, టెలికాం, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులకూ ఒప్పందం ఊతమిస్తుంది. అయితే అన్ని రంగాల్లోనూ ఒకే స్థాయి ప్రయోజనం ఉంటుందనుకుంటే పొరపాటే. రసాయనాలు, ఔషధాల్లో ఇండియాకు బలమైన సరఫరా సత్తావున్నా అక్కడ లభించే అదనపు లాభం పరిమితం. వజ్రాలు, బంగారం, వెండి ఉత్పత్తుల దిగుమతుల్లో (17,850 కోట్ల డాలర్లు) లండన్ స్వయంగా అంతర్జాతీయ బులియన్ కేంద్రం కావడంతో అక్కడ నెగ్గుకురావడం సవాలే. ప్లాస్టిక్, రబ్బరు, కాగితం, కొయ్య ఉత్పత్తులు, వంటనూనెల వంటి వాటిలో రవాణా వ్యయాలు, పర్యావరణ నిబంధనలు, తీవ్ర పోటీ కారణంగా ప్రయోజనాలు మధ్యస్థం. ఇనుము-ఉక్కుపై బ్రిటన్ కఠిన కోటాలు, మద్యం-పొగాకుపై ఆంక్షలు కొనసాగుతాయి కాబట్టి ఆ రంగాలనుంచి పెద్దగా ఆశించలేం.

అందుకే 'సెటా' ఫలాలను పూర్తిస్థాయిలో అందుకోవాలంటే ఇండియాకు రంగాలవారీ సమగ్ర ఎగుమతి వ్యూహం అత్యవసరం. సుంకాల తొలగింపు తలుపు తీయడం మాత్రమే -లోపల నిలదొక్కుకోవడానికి పూర్తిగా నాణ్యతా ప్రమాణాలే ఆధారం. ఆహార ఎగుమతిదారులు బ్రిటిష్ శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలి. ఏ చిన్న లోపం దొర్లినా సరకు మొత్తం తిరస్కరణకు గురై, దేశ ప్రతిష్ఠకూ మచ్చ తెచ్చే ప్రమాదం ఉంటుంది. వాహన ఎగుమతిదారులు 'రూల్స్ ఆఫ్ ఆరిజిన్' నిబంధనలను క్షుణ్నంగా అవగతం చేసుకుని, వస్తూత్పత్తి మూలాన్ని నిర్ధారించే ధ్రువపత్రాల ప్రక్రియలో నైపుణ్యం సాధించాలి. ఒప్పంద ప్రయోజనాల్లో సింహభాగం చిన్న, మధ్యతరహా పరిశ్రమలకే దక్కాల్సి ఉన్నా -వాటికి అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులపై అవగాహన కొరవడటమే పెద్ద అవరోధం. ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు, వాణిజ్య శాఖ క్షేత్రస్థాయిలో అవగాహన శిబిరాలు నిర్వహించి, ధ్రువీకరణ ప్రక్రియల్లో చేయూతనందించి, రుణ లభ్యతను సులభతరం చేయాలి. బ్రిటన్ అమలు చేయనున్న కర్బన సర్దుబాటు సుంకాల (సీబీఏఎం) వంటి పర్యావరణ నిబంధనలు భవిష్యత్తులో ఉక్కు, అల్యూమినియం, సిమెంట్ ఎగుమతులకు అడ్డంకిగా మారే ప్రమాదం పొంచి ఉంది కాబట్టి -హరిత ఉత్పత్తి విధానాలవైపు మన పరిశ్రమలు ఇప్పటినుంచే మళ్లాలి. సుంకాలు తగ్గినా సాంకేతిక అవరోధాలు, నాన్-టారిఫ్ నిబంధనల రూపంలో అడ్డుగోడలు మిగిలే ఉంటాయన్న స్పృహతో వ్యవహరించాలి. మరోవైపు బ్రిటన్ వస్తువులకూ భారత మార్కెట్ క్రమంగా తెరుచుకుంటుంది కాబట్టి -స్కాచ్ విస్కీ, విలాసవంత వాహనాల వంటి దిగుమతుల పోటీని తట్టుకునేలా దేశీయ పరిశ్రమలు సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలి. ప్రపంచ సరఫరా గొలుసులు పునర్వ్యవస్థీకరణ చెందుతున్న తరుణంలో లభించిన అవకాశాన్ని ప్రభుత్వం, పరిశ్రమలు, ఎగుమతిదారులు త్రికరణశుద్ధిగా అందిపుచ్చుకుంటే -'వికసిత భారత్' స్వప్న సాకారంలో బ్రిటన్ వాణిజ్య వారధి కీలక మజిలీ కాకపోదు! ■



ఏదైనా వస్తువును కొనేటప్పుడు.. 'నా దగ్గర అంత డబ్బు లేదు' అని అనకండి. అది మిమ్మల్ని మానసికంగా బలహీనులను చేస్తుంది. దానికి బదులుగా, ప్రస్తుతానికి ఇది నా బడ్జెట్లో లేదు' అని చెప్పడం అలవాటు చేసుకోండి. మొదటి మాట మీ అసహాయతను చూపిస్తే.. రెండోది మీ ఆర్థిక క్రమశిక్షణను తెలియజేస్తుంది. మాటలు మారిస్తే ఆలోచనలు మారతాయి.. ఆలోచనలు మారితే అలవాట్లు మారతాయి.. అలవాట్లు మారితే ఆర్థిక భవిష్యత్తే మారిపోతుంది. 'లేదు' అనే నిస్సహాయత నుంచి 'ఇప్పుడు కాదు' అనే నియంత్రణ వైపు అడుగేయడమే నిజమైన ఆర్థిక పరిణతి. డబ్బు మీద అదుపు సాధించినవాడే.. జీవితం మీద అధికారం సాధించగలడు!

-మహాదేవ

## వింతల్లో వింతలు

### వంతెన కింద వాడకట్టు!



ఇళ్ల పైనుంచి వాహనాలు దూసుకుపోతే ఎలా ఉంటుంది? చైనాలోని గుయియాంగ్ నగరవాసులకు ఇది నిత్యానుభవమే! అక్కడి 'షుయికౌసి' వంతెన.. డజనుకు పైగా అపార్ట్‌మెంట్ భవనాల మీదుగా నేరుగా సాగిపోతూ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. 1997లో ఈ వంతెన నిర్మాణం పూర్తయ్యాక.. నగరంలో స్థల కొరత తీవ్రంగా ఉండటంతో అధికారులు వినూత్న ఆలోచన చేశారు. వంతెన కింద ఖాళీగా ఉన్న భూమిలోనే పేదల కోసం అద్దె గృహాలు, పునరావాస భవనాలు నిర్మించారు. నగర నడిబొడ్డుకు దగ్గరగా ఉండటం వీటి ప్రత్యేకత. అయితే పైనుంచి నిరంతరం సాగే ట్రాఫిక్ శబ్దం, ప్రకంపనలు, దుమ్ము ఇక్కడి వేలాది మంది నివాసితులకు దైనందిన జీవితంలో భాగమైపోయాయి. అయినా అద్దె తక్కువ కావడం, సిటీ సెంటర్ అందుబాటులో ఉండటంతో ఎవరూ పెద్దగా ఫిర్యాదు చేయరట! శబ్దాన్ని తగ్గించేందుకు భారీ ట్రక్కులను వంతెనపై నిషేధించారు కూడా. 40 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరంలో స్థలాభావాన్ని అధిగమించిన వినూత్న పట్టణ ప్రణాళికగా దీన్ని నిపుణులు ప్రశంసిస్తున్నారు.

# ‘గోల్’డెన్ ఛాన్స్ కొట్టేదెవరో

**ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్ నేడే**

**అర్జెంటీనాతో స్పెయిన్ ఢీ**

**అర్ధరాత్రి 12.30 నుంచి యునైట్8 స్పోర్ట్స్‌లో**

ప్రపంచంలో అత్యధిక దేశాలు ఆడే క్రీడ.. క్రీడాభిమానులు అత్యధికంగా చూసే ఆట.. మజాకు, ఉత్కంఠకు లోటే లేని ఫుట్‌బాల్‌లో అత్యున్నత సమరానికి వేళైంది. ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ ఆదివారమే. భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి 12.30కి మొదలయ్యే పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, 2010 విజేత స్పెయిన్ అమీతుమీ తేల్చుకోబోతున్నాయి. బలాబలాల్లో రెండు జట్లూ సమవుజ్జీలే కావడం.. మేటి జట్లను వెనక్కి నెట్టి ఫైనల్‌కు రావడంతో టైటిల్ పోరు హోరాహోరీగా, రసవత్తరంగా సాగుతుందనడంలో సందేహం లేదు. నాలుగేళ్ల కిందట మెస్సి చేతిలో ప్రపంచకప్ చూసి ఉప్పొంగిపోయిన అర్జెంటీనా అభిమానులు.. దిగ్గజ ఆటగాడికి మరో కప్పుతో తమ జట్టు వీడ్కోలు పలకాలని ఆశిస్తున్నారు. గత టోర్నీలో ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరిగాక, పక్కా ప్రణాళికలతో అడుగులేస్తూ 2023 నేషన్స్ లీగ్, 2024 యూరో కప్ గెలిచిన స్పెయిన్.. ఇప్పుడు ప్రపంచకప్ గెలిచేందుకు వచ్చిన అద్భుత అవకాశాన్ని వదలకూడదనే పట్టుదలతో ఉంది.

**ఇలా తొలిసారి..**

ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో తలపడబోతున్న అర్జెంటీనా, స్పెయిన్ వారి ఖండాల్లో జరిగే ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ టోర్నీల్లో విజేతలుగా ప్రపంచకప్‌నకు వచ్చాయి. దక్షిణ అమెరికా టోర్నీ కోపా అమెరికాలో అర్జెంటీనా 2024లో విజేతగా నిలవగా.. అదే ఏడాది యూరో కప్‌లో స్పెయిన్ ఛాంపియన్ అయింది. ఒకే సమయంలో ఈ రెండు టోర్నీల విజేతలుగా నిలిచిన జట్లు ప్రపంచకప్‌లో తలపడనుండడం ఇదే తొలిసారి.

**ఒక టికెట్ రూ.27 లక్షలు!**

న్యూయార్క్: అర్జెంటీనా-స్పెయిన్ మధ్య ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్ టికెట్ల ధరలు కొండెక్కాయి. ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చే న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియంలో సాధారణ టికెట్ ధర దాదాపు రూ.6.68 లక్షలు ఉన్నట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. ఇది అర్జెంటీనా-ఇంగ్లాండ్ మధ్య సెమీఫైనల్ మ్యాచ్ టికెట్ ధర (రూ.6 లక్షల 93 వేలు) కంటే కాస్త తక్కువే. కానీ టిక్‌పిక్ నివేదిక ప్రకారం తాజా ప్రపంచకప్ ఫైనల్లో సాధారణ టికెట్ ధర రూ.11 లక్షలు ఉండగా.. ప్రీమియం క్లాస్ టికెట్ ధర ఏకంగా రూ.27 లక్షలు పలుకుతోంది. ఇదే నిజమైతే ఇప్పటిదాకా యుఎస్‌లో జరిగిన క్రీడా పోటీల్లో అత్యధిక టికెట్ ధర ఇదే అవుతుంది. 2024లో శాన్‌ఫ్రాన్సిస్కో, కాన్సాస్ సిటీ మధ్య జరిగిన సూపర్ బౌల్ బేస్‌బాల్ పోరులో ఒక టికెట్ అత్యధికంగా రూ.9 లక్షలు పలికింది.

**తుదిపోరుకు పొగ సమస్య?**

ప్రపంచకప్ ఫైనల్‌కు వాతావరణ సమస్య తలెత్తుతుందేమో అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కెనడాలో అగ్నికీలల తాలూకు ప్రభావంతో అమెరికాలో పలు చోట్ల మేఘాలను దట్టమైన పొగ కమ్మేస్తోంది. ఫైనల్ జరిగే న్యూజెర్సీ నగరం కూడా ఈ పొగ బారిన పడి ఇబ్బంది పడుతోంది. ఫైనల్ ముంగిట న్యూజెర్సీలో సాధన సందర్భంగా ఇరు జట్ల ఆటగాళ్లు మాస్కులు ధరించారు. ఫైనల్‌కు ఇబ్బంది తలెత్తకుండా పొగను నియంత్రించే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. కొంత ఇబ్బంది తప్పకపోవచ్చు.



# కళ్లన్నీ రోహిత్‌పైనే

**ఇంగ్లాండ్‌తో భారత్ మూడో వన్డే నేడు**

**మధ్యాహ్నం 3.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో**



విజయంతో ఇంగ్లాండ్ పర్యటనను ముగించాలనుకుంటున్న గిల్ బృందం ఆఖరి సమరానికి సన్నద్ధమైంది. ఆదివారం జరిగే చివరిదైన మూడో వన్డేలో ఇంగ్లిష్ జట్టును ఢీకొంటుంది. తొలి వన్డేలో 6 వికెట్ల తేడాతో నెగ్గిన భారత్.. రెండో మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో ఓడిపోయింది. నిర్ణయాత్మక మ్యాచ్‌లో నెగ్గాలంటే భారత్ అన్ని విభాగాల్లోనూ మెరుగుపడాలి.

అతడు మెరిసేనా: లార్డ్స్‌లో వన్డే రోహిత్ కెరీర్‌లో చివరి మ్యాచని, 2027 ప్రపంచకప్‌నకు అతణ్ని ఎంపిక చేసే ఉద్దేశం సెలక్టర్లకు లేదంటూ వచ్చిన ఊహాగానాలు కలకలం రేపిన సంగతి తెలిసిందే. అతడికిదే చివరి అంతర్జాతీయ మ్యాచ్ కాదని బీసీసీఐ స్పష్టంగా చేసినప్పటికీ.. రోహిత్ సత్తా చాటుకోవాల్సిన అవసరముంది. గత రెండు వన్డేల్లోనూ రోహిత్ ఇబ్బందిపడ్డాడు. 39 ఏళ్ల రోహిత్.. తొలి వన్డేలో 21 బంతుల్లో 11 పరుగులే చేశాడు. రెండో మ్యాచ్‌లో 47 బంతుల్లోనే 26 చేసి వెనుదిరిగాడు. ఈ కీలక సమరంలో ఎలా పుంజుకుంటాడో చూడాలి. అతడు కెప్టెన్ గిల్‌తో కలిసి శుభారంభాన్నివ్వడం టీమ్‌ఇండియాకు చాలా అవసరం. ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ ఆరంభ ఓవర్లలో అతడికి గట్టి సవాలు విసరొచ్చు.

కెప్టెన్ గిల్, కోహ్లి ఫామ్‌లో ఉండడం భారత్‌కు సానుకూలాంశం. గత మ్యాచ్‌లో 66 పరుగులు చేసిన శ్రేయస్ కూడా లయలో ఉన్నాడు. కేఎల్ రాహుల్ పరుగుల బాట పట్టాల్సివుంది. అనారోగ్యం కారణంగా గత మ్యాచ్‌కు దూరమైన అతడు.. ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉన్నాడు. బౌలింగ్‌లో గుర్నూర్ బ్రార్, ప్రసిద్ధ్ కృష్ణలతో కలిసి బుమ్రా పేస్ భారాన్ని పంచుకోనున్నాడు. వాషింగ్టన్ సుందర్ గాయపడ్డ నేపథ్యంలో అతడి స్థానంలో కుల్‌దీప్ యాదవ్‌కు చోటు దక్కవచ్చు. హర్ష్ దూబె కూడా పోటీలో ఉన్నాడు. టీ20 సిరీస్‌ను గెలుచుకున్న ఇంగ్లాండ్... వన్డే సిరీస్‌నూ చేజిక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది. ఆర్చర్, టంగ్, సకిబ్‌లతో కూడిన పేస్ త్రయం మరోసారి భారత బ్యాటర్లను పరీక్షించడానికి సిద్ధమవుతోంది. బ్యాటింగ్‌లో రూట్‌తో పాటు బట్లర్, బ్రూక్ ఆ జట్టుకు కీలకం.

**సుందర్ స్థానంలో హర్ష్ దూబె**

ఇంగ్లాండ్‌తో మూడో వన్డేకు హర్ష్‌దూబె జట్టులోకి వచ్చాడు. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయపడడంతో అతడి స్థానంలో సెలక్టర్లు హర్ష్‌ను ఎంపిక చేశారు. రెండో వన్డే సందర్భంగా సుందర్ గాయపడ్డాడు. ఈ జూన్‌లో సొంతగడ్డపై అఫ్గానిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో 23 ఏళ్ల హర్ష్ అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో అతడు రెండు మ్యాచ్‌లు ఆడి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఈ నెల 23న ఆరంభమయ్యే జింబాబ్వే సిరీస్‌లో ఆడే భారత టీ20 జట్టులోనూ హర్ష్ ఉన్నాడు.

పిచ్ ఎలా ఉందంటే: లార్డ్స్‌లో పిచ్ స్ట్రోక్‌ప్లేకు మరీ అంతగా సహకరించదు. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే అవకాశాలు మెండు. టీమ్‌ఇండియా ఇక్కడ చివరిసారి 2004లో గెలిచింది. మొత్తంగా ఇక్కడ ఆడిన 9 వన్డేల్లో భారత్ నాలుగు గెలిచింది. అందులో 1983 ప్రపంచకప్ ఫైనల్ ఒకటి.



వెల్వెట్ బ్లాక్ దుస్తుల్లో ‘పవర్ గ్లామర్’ను ప్రదర్శిస్తున్న షామా సికందర్

# ఆన్‌స్క్రీన్ ఫ్లాప్.. ఆఫ్‌స్క్రీన్ సూపర్ హిట్!



సినిమా ఇండస్ట్రీలో హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ చిగురించడం, ఆ తర్వాత వారు పెళ్లి బంధంతో ఒక్కటవ్వడం మనం తరచూ చూస్తూనే ఉంటాం. అయితే ఆశ్చర్యకరంగా టాలీవుడ్‌లో కొంతమంది స్టార్స్ నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఘోరంగా ఫ్లాప్ అయ్యాయి. కానీ, ఆ సినిమాలే వారి జీవిత భాగస్వాములను వారికి పరిచయం చేశాయి. ఆన్‌స్క్రీన్‌పై ఫ్లాప్ అయినప్పటికీ, ఆఫ్‌స్క్రీన్‌లో సూపర్ హిట్ అయిన ఆ క్రేజీ రియల్ లైఫ్ జంటల ముచ్చట్లు మీకోసం..

**జీవిత - రాజశేఖర్:**

టాలీవుడ్ సీనియర్ కపుల్ యాంగ్రీ స్టార్ రాజశేఖర్, జీవితలది ఎవర్ గ్రీన్ లవ్ స్టోరీ. వీరిద్దరూ ‘తలంబ్రాలు’ సినిమాతో తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఇక ఆ సినిమా టైమ్‌లోనే వీరిద్దరి ఆలోచనలు కలవడంతో ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత 1991లో పెళ్లి చేసుకున్న ఈ సీనియర్ జంట ఇప్పటికీ ఇండస్ట్రీలో బెస్ట్ కపుల్‌గా కొనసాగుతున్నారు.

**మహేష్ బాబు - నమ్రత శిరోద్కర్:**

టాలీవుడ్‌లోనే మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ క్రేజీ కపుల్ ఎవరంటే మహేష్ బాబు, నమ్రత జంట అని కచ్చితంగా చెప్పొచ్చు. వీరిద్దరూ కలిసి ‘వంశీ’ అనే చిత్రంలో నటించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎంత పెద్ద ఫ్లాప్ అయిందో అందరికీ తెలిసిందే. కానీ ఈ సినిమా షూటింగ్ సమయంలోనే వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుని, ఇప్పుడు హ్యాపీగా లైఫ్ లీడ్ చేస్తున్నారు.

**వరుణ్ తేజ్ - లావణ్య త్రిపాఠి:**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి లవ్ స్టోరీ కూడా ఇలాంటిదే. వీరిద్దరూ కలిసి నటించిన మొదటి సినిమా ‘మిస్టర్’ అట్టర్ ఫ్లాప్‌గా నిలిచింది. కానీ ఈ సినిమా సెట్స్‌లోనే వీరి మధ్య స్నేహం కాస్తా ప్రేమగా మారింది. ఇక దాదాపు నాలుగేళ్ల పాటు తమ ప్రేమను సీక్రెట్‌గా ఉంచిన ఈ జంట, ఆ తర్వాత ఘనంగా వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ అన్యోన్య దంపతులకు ఒక కొడుకు కూడా ఉన్నాడు.

**నారా రోహిత్ - సిరి లెల్లా:**

నటుడు నారా రోహిత్ కూడా తన సినిమా హీరోయిన్నే లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. రోహిత్, సిరి లెల్లా జంటగా ‘ప్రతినిధి 2’ అనే చిత్రంలో నటించారు. ఈ సినిమా ఆడియన్స్‌ను పెద్దగా ఆకట్టుకోలేక ఫ్లాప్ లిస్ట్‌లో చేరింది. అయితే ఈ సినిమా పరిచయంతోనే ఒకటైన ఈ ఇద్దరూ, గతేడాది వివాహ బంధంతో అధికారికంగా తమ రియల్ లైఫ్ జర్నీని స్టార్ట్ చేశారు.


**వరుణ్ సందేశ్ - వితికా షేరు:**

ఇక వరుణ్ సందేశ్ ‘కొత్త బంగారు లోకం’ సినిమాతో ఒకప్పుడు యూత్‌లో ఓ రేంజ్ క్రేజ్ తెచ్చుకున్నాడు. ఆ తర్వాత వరుస ఫ్లాపులు పడుతున్న సమయంలో వితికాతో కలిసి ‘పడ్డానండీ ప్రేమలో మరి’ అనే సినిమాలో నటించాడు. ఇక ఈ సినిమా ఫ్లాప్ అయినా, వీరిద్దరూ మాత్రం నిజంగానే ఒకరి ప్రేమలో ఒకరు పడిపోయి పెళ్లి పీటలెక్కారు.

**రితేష్ దేశ్ ముఖ్ - జెనీలియా:**

తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న జెనీలియా, బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్ ముఖ్‌ను ప్రేమించి పెళ్లాడింది. వీరిద్దరూ కలిసి నటించిన ‘తుజే మేరీ సనమ్’ అనే హిందీ చిత్రం యావరేజ్‌గా ఆడింది. ఆ సినిమాతో మొదలైన వీరి బంధం పెళ్లి వరకు తీసుకెళ్లింది. ఇక ప్రస్తుతం ఈ జంట బాలీవుడ్‌లోనే మోస్ట్ హ్యాపియెస్ట్ కపుల్‌గా పేరు తెచ్చుకుంది.

సినిమా రిజల్ట్‌తో సంబంధం లేకుండా, మనసు కలిస్తే జీవితం ఎంత అందంగా ఉంటుందో ఈ సెలబ్రిటీ జంటలను చూస్తే అర్థమవుతుంది. వెండితెరపై ఫ్లాప్ టాక్ తెచ్చుకున్నప్పటి కీ, నిజ జీవితంలో మాత్రం ఒకరికొకరు తోడుగా ఉంటూ వందకు వంద మార్కులతో సూపర్ హిట్ జంటలుగా దూసుకుపోతున్నారు.



అద్భుతమైన సంప్రదాయ రూపంతో అభిమానుల మనసు గెలుచుకున్న నాభా నటేష్

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com